PRAMUKHANDHRA

*21st Year of Publication*

We carry the news and views of Telugus

# ప్రముఖాంధ్ర

సంపాదకుడు

గోటేటి శ్రీ రామారావు

₹15

అక్టోబర్ 2015



THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA





# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

అక్టోబర్ 2015

సంపుటి : 21 **249** సంచిక : 9




# తెలుగుజాతి ఘనకీర్తి తెలుగు భాషలోనే ఉన్నది!

**భా**ష సుజల ప్రవాహం. జీవనది వలె ప్రవహిస్తూనే ఉంటుంది. మధ్యలో తెప్పల్లా కొన్ని వచ్చి ప్రవాహ ఉధృతానికి తెప్పరిల్లి పోతుంటాయి.

అనంతమైన ఈ ప్రయాణం అంతుబట్టదు. తంతు తెలియదు. పాలిచ్చే ఆవు సహితమూ పొదుగులను పాలుకోసం పిండుతుంటే– వెనుక రెండు కాళ్లతో తన్నుతూంటుంది. అంతమాత్రాన పాలను పితకకుండా ఉంటామా?

పాలు సంపూర్ణ ఆహారమనే మాటను శిరమున దాల్చకుండా ఉంటాం. నెలబిడ్డకు, ఉదయం కాఫీ, టీలు కలుపుకోవడానికీ, పెరుగు తోడు పెట్టుకోవడానికీ పాలు కావాలి. అటువంటి పాలను నేలపాలుచేస్తున్నాం.

అభిమానంతో, ఆశతో ఆర్ద్రతతో, ఆవేశంతో అభినివేశంతో మాతృభాషకున్న ప్రాధాన్యం అపారం. భావ శిల్పాన్ని వ్యక్తీకరించడంలో మాతృభాష మధురతే వేఱు.

తెలుగువాడెన్నో మాతృభాషలోనే కనిపెట్టాడు. సిద్ధాంతాలను ఆవిష్కరించాడు. భూమ్మీద కల సమస్త వస్తువుల్నీ సాపేక్షంగా చూసాడు. సాక్షీ భూతుడయ్యాడు.

పూర్వీకుల ప్రతిభే భాషను అపూర్వంగా నడిపిస్తున్నది. కానీ పూర్వీకుల్లా తెలుగుదనమును కాపాడుకోలేకపోతున్నాం. సాధికారికంగా వ్యవహరించ లేకపోతున్నాం.

గాంధీగారికి సలహాదారుగా ఉండిన భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు బ్రిటిషువారి కాలంలోని రూపాయి నాణాన్నీ, రూపాయ నోటుల్నీ గాంధీగారికి చూపిస్తూ బ్రిటిషువారు తెలుగు భాషకు (లిపి) ఎంతటి ప్రాముఖ్యతనిస్తూ, ముద్రించారో చూడండి యని చూపించారు. ఆయన బి.ఎస్. రామయ్య అనో, బి. సీతారామయ్య అనో గాకుండా భోగరాజు పట్టాభి సీతారామయ్య గానే వ్యవహరింపబడ్డారు. మధ్యప్రదేశ్ గవర్నరుగా ఉన్నప్పుడు కూడా అధికార భాషలో ఉత్తరం ఉన్నప్పటికినీ, తన సంతకాన్ని భోగరాజు పట్టాభి సీతారామయ్య అను తెలుగు అక్షఱాలతో సంతకం పెట్టేవారు.

మాతృభాష 'అమ్మా అమ్మా' అని పిలవడం అలవాటుపడిననాడు అంతరాళం నుంచీ పలుకుతాడు.

అవధానాలు జరిగే చోటుకు వెళ్లి 'అహో ఒహో అంటాడే గాని, ఒక్కమాటను అర్థం చేసుకోడు. పద్యం మనది గద్యం మనది. అప్పయ్య దీక్షితులుగారిలా అన్నారు అంటాడు. కానీ ఒక్క శతకంలోని ఒక్క పద్యం చదవడానికైనా ప్రయత్నించం. భారతియార్ 'సుందర తెలుంగు' అంటూ ప్రశంసించారని అంటాంగానీ ఐ విల్ స్పీక్ లేటర్ అని మాటతో ముగిస్తాం.

'ఆవకాయ' మా తెలుగువారికి యిష్టం అంటూనే ఫ్రైడ్‌రైస్ తింటాం.

హరికథ మనది బుర్రకథ మనది అంటాం గానీ సినిమాకే వెడతాం. పంచెకట్టును మన తెలుగువారి దంటూనే లుంగీ కడతాం. తెలుగు భాషలో మాట్లాడినా తెలుగునేలను తాకినా మనసు తుళ్ళితుళ్లిపడాలి. గోదావరిలా పరవళ్లు తొక్కాలి. కృష్ణలా, కిలకిలా నవ్వే కిన్నెరసానిలా, పొంగే పెన్నలా, ఉత్తుంగ నెగసే తుంగా జలంలా ఉండేచోటే తెలుగును మనసిచ్చే వెలుగుగా, ముద్దమందారంగా, మల్లెల సౌరభంగా వరిపంటల్లావర్థిల్లుతూ తెలుగువారి సంస్కృతీ సాంప్రదాయాల కోసం ఓనమాలు దిద్దుకునే ప్రయత్నం చేద్దాం.

తెలుగు జాతి వైభవాన్ని తెలుగు భాషా వైశిష్ట్యాన్ని, పలుకుల్లోని కులుకులూ, ఇతిహాస ఇంపు సొంపులనూ గ్రహించడానికి దిగంతాలు తాకిని తెలుగు కీర్తిని తెలుసుకోవడానికెన్నో ఉన్నాయ్.

అన్నమయ్య కీర్తనలు, త్యాగరాజస్వామి కృతులు, రామదాసు పాటలు, క్షేత్రయ్య పదాలు ప్రపంచమంతటా పరవశింపచేస్తున్న కూచిపూడి నృత్యం, జానపద కళలు, జానపద గేయాలు– ఇలా ఎన్నెయనా చెప్పుకోగలం.

తెలుగు పౌరుషం గురించీ అపౌరుషాలైన వేద సంశోధనం గురించీ ఎన్నో చెప్పుకోవాల్సినవి ఉన్నాయ్.

తరంగాలు మనవి. గలగలా గోదారి, బిరబిరా పారే కృష్ణా తీరాల్లో ఎన్ని ఆలయాలున్నాయ్. ఎన్ని సంస్కృతులున్నాయ్.

ప్రతీ కాలానికీ క్రీస్తుపూర్వం క్రీస్తుశకమనడమే మనమెరిగినది. అంతకు పూర్వం శకముల చరిత్ర చెప్పలేరు గానీ ఆంధ్రశకముల చరిత్రలో ఐదువేల శతాబ్దములు చరిత్ర ఉన్నది. వేదాలను శోధించినవారున్నారు. శ్రవణం చేసినవారున్నారు. పఠనం చేస్తున్నవారున్నారు. వ్యాఖ్యానాలు వ్రాస్తున్నవారున్నారు. శాస్త్రజ్ఞులున్నారు, సైంటిస్టు లున్నారు. వేదాంతులున్నారు. భగవత్సంభూతులున్నారు, భాగవతులున్నారు. భగవంతులున్నారు.

శిల్పంలో, చిత్రలేఖనంలో, కావ్యాల్లో ఎంతో ప్రతిభాశాలురున్నారు. వాఙ్మయం ఉంది. అన్నీ తెలుసుకునే తెలుగు అధ్యయనం తరిగిపోతున్నది.

ఈ తరగని, పాల తొరకల వంటి తెలుగును, పాల పాయసం లాంటి తెలుగు సారస్వతాన్నీ ఆస్వాదించే భవిష్యత్తరాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించడం అవసరం. ప్రపంచంలో 15 కోట్ల మంది తెలుగువారున్నారని లెఖ్ఖలు కట్టి చెబుతున్నారు. లెఖ్ఖకు మించిన తెలుగు సంఘాలున్నాయ్. ప్రతీ దేశమూ, ప్రతీ సంవత్సరమూ బృహత్సమావేశాన్నీ, మహాసభను జరుపుతూంది.

అవధానాలు జరుపుతున్నారు. పుస్తక ఆవిష్కరణలు చేస్తున్నారు.



ఈ 15 కోట్ల మంది తెలుగువారిలో ఓ కోటిమంది తెలుగువారు 5 గుర్ని చొప్పున తెలుగును అభ్యసింపచేస్తే (వ్రాయనూ చదువనూ) 5 కోట్లమంది భాషా సంపన్నులౌతారు.

తెలుగువారు మూడు కోట్లున్నప్పుడే మూడు సముద్రాలు దాటి వాణిజ్యాన్ని తెలుగుదనాన్ని వికసింపచేశారు. ఇప్పుడు చేయలేరా!

బుధజన విధేయుడు

*– గోటేటి శ్రీరామారావు*


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

# శ్రీ జగద్గురు భారతీతీర్థ మహాస్వామి చరణుల ఉపదేశము



# పునర్జన్మ

**మాలాసుధాకుంభవిబోధముద్రావిద్యావిరాజత్ కరవారిజాతమ్।**
**అపార కారుణ్యసుధాంబురాశిం శ్రీశారదాంబాం ప్రణతోఽస్మి నిత్యమ్॥**

మన పూర్వీకులు మన ముందుంచిన లక్ష్యం : జన్మరాహిత్యానికై ప్రయత్నించడం. ఆత్మ మరో దేహంలో ప్రవేశించకపోతే ముక్తి లభించినట్లు. లేకపోతే జననమరణ వలయంలో మనం చిక్కుకొని కొట్టుమిట్టాడవలసిందే! మన పూర్వీకులు ఈ విషయం గురించి తీవ్రంగా ఆలోచించారు. వారు భౌతిక పదార్థాల గురించి విశ్లేషణ చేస్తూ తమ సమయాన్ని వృధా చేయలేదు.

మన మహర్షులు ఆత్మతత్త్వం, సత్యం, గురించి, తీవ్రంగా ఆలోచించారు. అటువంటి తీవ్రమైన ఆలోచన కఠోపనిషత్తులోని నచికేతుని కథలో మనకు కనబడుతుంది. మృత్యుదేవతయైన యమధర్మరాజు నచికేతుని ముందు ప్రత్యక్షమై "నీకు ఒక వరాన్ని ఇస్తున్నాను. నీకు ఏమి కావాలో కోరుకో" అన్నాడు. "దేవా! నాకెటువంటి భౌతిక వాంఛలు లేవు. అటువంటి కోరికలకు నేనుదూరంగా ఉన్నాను" అని నచికేతుడు సమాధానమిచ్చాడు. అటువంటి అవకాశమే మనకు లభించినట్లయితే మనం ఓ పెద్ద పట్టికనే తయారు చేసేవాళ్లం. అందులో మన కోరికలన్నీ ఉండేవి. అయితే నచికేతుడు మన వంటి సామాన్య వ్యక్తి కాదు. అతను శాశ్వత నిత్యసత్య అన్వేషకుడు. నచికేతుడు యమధర్మరాజునిలా ప్రశ్నించాడు.

**యేయం ప్రేతే విచికిత్సా మనుష్యే అస్తీత్యేకే నాయమస్తీతి చైకే।**
**ఏతద్విద్యా మనుశిష్టస్త్వయాహం వరాణా మేష వర స్తృతీయః॥**

"నాకు ప్రాపంచిక సుఖభోగాలలో ఆసక్తిలేదు. పరమసత్యం గురించి నేను తెలుసుకోవాలనుకుంటున్నాను. మరణానంతరం ఆత్మ ఏమవుతుంది? అది ఆ తరువాత ఉంటుందా? ఉండదా? మరణానంతరం ఏమీ ఉండదని కొందరంటారు. మరికొందరు ఆత్మకు చావులేందంటారు. అసలు ఏది సత్యం?"

కొందరు నాస్తికులు, శ్రద్ధలేనివారు. మరికొందరు ఆస్తికులు. శ్రద్ధ కలిగినవారు. ఆస్తికులు మరణానంతరం కూడా జీవితముంటుందని చెప్తారు. నాస్తికులు దాని నంగీకరించరు. మరణానంతరం ఏమీలేదు. మరణం సంభవించిన పిదప దేహాన్ని దహనం చేసిన తరువాత బూడిద తప్ప వేరే ఏమీ ఉండదు అంటారు.

**భస్మీభూతస్య దేహస్య పునరాగమనం కుతః।**
**యావజ్జీవేత్ సుఖం జీవేత్ ఋణం కృత్వా ఘృతం పిబేత్॥**

"ప్రియమిత్రులారా! భస్మం అయిన ఈ దేహంతోపాటే అన్నీ ముగుస్తాయి. సుఖంగా జీవితమంతా గడపండి. సుఖపడగల సమయంలోనే సుఖపడండి. భవిష్యత్తు గురించి ఆందోళన ఎందుకు; మీరుండనప్పుడు ఏమి జరిగినా ఏం పోయింది? ఈ జీవితం గురించి సుఖపడటం గురించి ఆలోచించండి"

ఆస్తికులు పూర్తిగా ఇందుకు భిన్నమైన పాటపాడ్తారు. "మిత్రులారా! మరణం ముగింపు కాదు. మరణం తరువాత కూడ ఆత్మ ఉంటుంది. ఆత్మకు పుట్టుక చావులుండవు. నీకు పునర్జన్మ ఉంటుంది. ఈ జన్మలో నీవాచరించిన పాపపుణ్య కర్మలాధారంగా నీ జన్మ ఉంటుంది. పుణ్యకర్మ ఉత్తమజన్మకు కారణమైతే, పాప కర్మలు నీచజన్మకు కారణమవుతాయి"

యమధర్మరాజు ఇలా సమాధానమిచ్చాడు : "కుమారా! నాస్తికుల అభిప్రాయాన్ని నేను అంగీకరించను. ఆత్మ శాశ్వతం"

**యోనిమన్యే ప్రపద్యంతే శరీరత్వాయ దేహినః।**
**స్థాణుమన్యేఽనుసంయన్తి యథాకర్మ యథాశ్రుతమ్॥**

"ఆస్తికులు చెప్పేది సత్యమే. శ్రద్ధా విశ్వాసాలతో జీవించండి. మరణం తరువాత మీ పాప పుణ్య కర్మల ప్రకారం మీ జీవితం ఉంటుంది"

మన పూర్వీకులైన మహాపురుషులు ఈ పూర్వజన్మ విషయం గురించి చాలా తీవ్రంగా విచారించారు. దీనిపై విస్తృతమైన సాహిత్యం కూడా ఉన్నది. అయినా ఈనాటి నాస్తికుడు ఇలా అంటున్నాడు : "ఇదంతా మేము నమ్మము. గుడ్డిగా మేము దేనినీ నమ్మము. మీ వాక్యాలను పరమసత్యంగా అసలు స్వీకరించడం. మన పూర్వీకులు చెప్పారంత మాత్రాన నమ్మము. అదొక్కటే నమ్మకానికి కారణమైతే, మేము చూసి, పరీక్షించకుండా దేనిని నమ్మం"

చెప్పండి మీరు సంధిగ్ధావస్థలో నున్నారా? మరణానంతరం జీవితం ఉన్నదా? లేదా? అని. కొందరు పునర్జన్మ ఉన్నదంటున్నారు. మరికొందరు లేదంటున్నారు. "పరలోకం, పునర్జన్మ లేకపోతే మన శ్రమ అంతా వృధాయేకదా. లేనిదాని గురించి ఆందోళన చెందటమెందుకు? పరలోకం ఒక మిథ్య" అన్నది ఒక అభిప్రాయం.

దీనికి పూర్తిగా భిన్నాభిప్రాయం కూడా ఉన్నది : "పరలోకం కనుక ఉంటే భక్తి, దేవాలయం, ఈశ్వరుడు, పూజ మొదలైనవి అవసరం. పునర్జన్మ ఉంటే, నా ప్రయత్నాలన్నీ అర్థవంతమూ, ఫలవంతమూను. కాని ఏ మార్గాన్ని అనుసరించాలో నాకు తెలియటం లేదు. దయచేసి నాకు ఉపదేశించండి."

మన పూర్వీకులు ఈ సందేహానికి ఎప్పుడో చక్కటి సమాధానమిచ్చారు. అసలు ఎటువంటి సందేహానికి తావులేదు. ఈ విషయంపై సమంజసమైన తర్కబద్ధమైన వివరణను మనవాళ్లు ఇచ్చారు. మీకింకా ఏకొంచెమైనా సందేహముంటే ఆరోగ్యవంతమైన మార్గాన్ని ఆ సందేహం తీరటానికి మేము బోధిస్తాం. పరలోకం లేదని మీరు నమ్ముతున్నా, పరలోకమున్నట్లుగానే మీ విధులను, కర్తవ్యాలను నిర్వహించండి. అదే మీకు క్షేమకరమైన మార్గం. అయితే నాస్తికుడు ఎందుకు ముందుకు వెళ్లకూడదు? దానికి మీ అభ్యంతరమేమిటి?" ఈ ప్రశ్నకు కూడా మన పూర్వీకులు చక్కగా సమాధనమిచ్చారు

**సన్దిగ్ధేఽపి పరే లోకే కర్తవ్యో ధర్మ ఏవ హి।**
**నాస్తిచేత్ నాస్తి నో హానిః అస్తిచేత్ నాస్తికో హతః॥**

పరలోకం మీకు నమ్మకం లేకపోయినా, నమ్మకమున్నట్లుగా సత్కర్మల నిరంతర మాచరించటం శ్రేయస్కరం. ఎందువలనంటే దానివలన జరిగే నష్టమేమీ లేదు. ఒకవేళ పరలోకమునండి సత్కర్మల నాచరించకపోతే నాస్తికుడు నష్టపోతాడు కదా! అటువంటి ప్రమాదాన్ని మనమెందుకు ఎదుర్కొనాలి. ఈ విషయాన్ని మన పూర్వీకులు ఒక ఉదాహరణతో వివరించారు.

ఇద్దరు బాలురు రోడ్డుపైన నడిచివెళ్తుంటే దారిలో ఒక పుట్ట ఉన్నది. ఒక బాలుడు "ఈ పుట్టలో పాము ఉండవచ్చును" అన్నాడు. రెండవ బాలుడు "ఇందులో పాముగీము ఏమీ ఉండదు" అన్నాడు. ఆ సంభాషణను వింటున్న మూడో వ్యక్తి సందిగ్ధంలో పడ్డాడు. "ఈ పుట్ట దగ్గర నుంచి వెళ్లవచ్చా? వెళ్లకూడదా? అసలు ఈ పుట్టలో పాము ఉన్నదా? లేదా? వాస్తవ పరిస్థితి ఏమిటి? నేను ఇప్పుడు ఎలా వెళ్ళాలి?" అన్నదే అతని సందేహం. ఆ పరిస్థితులను చూస్తున్న నాలుగోవ్యక్తి కొంచెం తెలివైనవాడు ఇలా అన్నాడు : "అబ్బాయిలూ! పుట్టకు దూరంగా వెళ్లండి. అందులో పాము ఉన్నదా లేదా అని ఆలోచిస్తూ మీ సమయాన్ని వృధా చేసుకోకండి. పుట్టకు దూరంగా చుట్టూ తిరిగి వెళ్లటం మీకు క్షేమకరం"

(తరువాయి 5వ పేజీలో)

# వెనుకబడినవారినీ, అన్య మతస్థులనీ ఉన్నత పదవుల నధిష్టింపచేసింది భారత రాజ్యాంగమే!! రాజ్యాంగ సూత్రాన్ని అమలుపరచడంలో పొరబాటు ఉందేమో కానీ, రాజ్యాంగంలో లేదు.

దేశం వెనుకబడి ఉండరాదు! వెనుకబాటుతనాన్ని తరిమికొట్టాలి! అందరికీ విద్య అందుబాటు కావాలి! అందరికీ ఉపాధి లభించాలి! అందరూ ఆనందంగా ఉండాలి. దేశ పటిష్టతకూ, ఆర్థిక పరిపుష్టికీ – ఇవి పంచశీల సూత్రాలు కావాలి!

భారత రాజ్యాంగ రచనాకర్తల్లో అంబేత్కర్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, దుర్గాబాయ్ వంటి మేధావులను నియమించుకుని భారతదేశం రాజ్యాంగ రూపకల్పన చేసుకున్నది. స్వతంత్ర భారతదేశం నుంచీ పాకిస్థాన్ విడిపోయింది. అబ్దుల్ కలాం ఆజాద్ వంటివారు పాకీస్థాన్ వెళ్ళడానికి అనంగీకారం తెలిపారు. అలాటి దేశభక్తి కలవానికి భారత తొలి కేంద్ర ప్రభుత్వంలో విద్యాశాఖా మంత్రి పదవినిచ్చారు; అంబేత్కర్‌కు న్యాయశాఖా మంత్రి పదవినిచ్చారు. ఇవి రెండూ తొలి కేంద్ర మంత్రి మండలిలో ప్రాధాన్యత కల పదవులు!

వెనుకబడిన వర్గాలకు మంచి మంచి పదవులనధిష్టింపచేసినది భారత రాజ్యాంగం. నగరి నుంచీ వచ్చిన హరిజన నాయకుడు బి.ఎస్. మూర్తికి సహాయ మంత్రి పదవిని కల్పించింది. జకీర్ హుస్సేన్, ఫక్రుద్దీన్ ఆలీ మహమ్మద్, అబ్దుల్ కలామ్ ప్రభృతుల్ను రాష్ట్రపతుల్ను చేసింది! అలాటి భారత రాజ్యాంగం అన్య మతస్థులనూ, వెనుకపడిన వర్గాల వారిని ఉపేక్షించకుండా – న్యాయేన, ధర్మేన మార్గం అవలంబించింది.

పాకిస్థాన్ విడివడినా, అప్పటి మన నాయకులు, హిందూస్థానంగా ప్రకటించుకో లేదు, ఇది దురదృష్టకర విషయం. భారత్‌ను పటిష్టమయిన ప్రజాస్వామ్య దేశంగా యావత్ప్రపంచ దేశాలూ ప్రశంసించాయ్. కేంద్ర ప్రభుత్వం యొక్క అలీన విధానం – ఏ అగ్ర రాజ్యానికీ కొమ్ము కాయలేదు, కాలేదు!

ఇంత విశాల దృక్పథం కల భారతదేశంలో – సంకుచిత మనం కలవారు, దాస్యభావుకులూ, దోపిడిదారులూ బయల్దేరడం వల్లనే – ఆర్థికంగా ఎదగలేక పోతున్నది. వెనుక యేర్పడిన సింగపూర్ వంటి దేశాలు – భారత్ కన్నా ఆర్థికంగా, సాంకేతికంగా బలపడడాన్నించుక పరిశీలించాల్సి వున్నది! మనం చూడాల్సింది వారి భవనాలు కాదు! మనం దానినే చూచి గర్విస్తున్నాం. వారికి వనరులు లేవు! జీవ నదులు లేవు! పంటలు లేవు. మనకు మించిన విజ్ఞానవంతులా! పరిశోధకులా! యని ఆలోచించుకొనే సమయం వచ్చింది. అంతరిక్ష పరిజ్ఞానకర్తలు మనకున్నారు – జ్ఞానవంతులున్నారు. కానీ ప్రతిభావంతులు పరదేశాలకు పోతున్నారు. కొందరు విజ్ఞానవంతులకిచట ఉపాధి దొరకక విదేశాలు పోతున్నారు. వారి జ్ఞాన సంపదనచటే పంచిపెడుతున్నారు. భారతీయులు కష్టించి పనిచేస్తారనే నమ్మకం ఆయా దేశస్థుల్లో ఉన్నది. అరబ్బు దేశాల్లో కష్టించి పన్చేసే కూలీలను తీసుకునేవారు. ఇప్పుడు పై ఉద్యోగాలకు కూడా భారతీయుల్నే తీసుకుంటున్నారు. వాళ్ళకు లక్షలు లక్షలు నెలసరి జీతములిస్తున్నారు.

వీరి కారణంగా మన మేధా సంపదను అక్కడికే పంపించేస్తున్నాం. భారత రాజ్యాంగ రచనా నిపుణుల్లో ఒకరైన బి.ఆర్. అంబేత్కర్ గారు భారతీయుల్లోని వెనుకపడినవారికి విద్యా ఉపాదులు అవసరమనీ – అవి నిర్దీత కాలమే ఉండాలని నిర్దేశించడమే గాకుండా, విరామమెరుగకుండా పనిచేసేవారు అంబేత్కర్ సూచన లను భారత నాయకులు రాష్ట్రాలలోని ముఖ్యమంత్రులుగనూ, మంత్రులను చేసారు. ఈ సత్యాన్ని వెనుకపెట్టి వెనుకబడినవారికి మంత్రి పదవులనివ్వడంలేదని కొందరు నిందారోపణలు చేసారు. ఇప్పటి మంత్రివర్గాల్లో కొన్ని వర్గాలకు స్థానం ఉండలేదు. వారికిచ్చే ఎం.ఎల్.ఏ. సీట్లు అరకొరగా ఉన్నాయ్. బ్రాహ్మణులు, వైశ్యులు, రెడ్లూ మంత్రులుగా నున్నప్పుడు ఎందరో యితర వర్గాలకు స్థానం కల్పించారు. ఎగువ తరగతిలో ఎంతోమంది ఆర్థికంగా బాధపడుతున్నవారున్నారు. ఆర్థిక పరిస్థితులను బట్టి – వెనుకపడినవారిని గుర్తించాలి. కులం ప్రాతిపదికగా నిర్ణయించడంవల్లనో, ఏమో – తమనూ వెనుకపడిన తరగతి జాబితాలోనికి చేర్చమని అగ్రకులాలవారు అడుగుతున్నారు.

విద్య, విజ్ఞానములందు పరిణితి చెందిన వారినీ, అర్హతలున్న వారినీ – వెనుకపడి విద్యా విజ్ఞానార్హతల్ను బట్టి అగ్ర, వెనుకపడిన శ్రేణిని గుర్తించినప్పుడన్ని తరగతి వారల్లోనూ పోటీ యేర్పడి, విజ్ఞాన సంపన్నులు పెరుగుతారు, విజ్ఞాన సంపన్నులైనవారు ఉపాధి వెదుక్కుంటూ అన్య దేశాలకు వెళ్ళరు.

అందరూ విజ్ఞానవంతులు కావాలని అంబేద్కర్ ఆశించారు. వారి రిజర్వేషన్ల పరమార్థ ఆంతర్యమిదే! ●

---

*(4వ పేజీ తరువాయి)*

అలాగే పరలోకాలు ఉన్నాయా లేవా అని ఆలోచిస్తూ మన సమయాన్ని వృధా చేసికొనవద్దు. అవి ఉన్నాయనుకొని మనం ప్రగతిపథంలో ప్రయాణించాలి. నాస్తికునికి సంకట పరిస్థితులు తప్పవు. అందువలన శుద్ధ ప్రామాణిక జీవితాన్ని గడపాలి. ధర్మాన్ని ఆచరించాలి. మన ఋషులు మనకు నేర్పిన విషయమిదే.

దైవభక్తి మనకు పుట్టుక నుండే అబ్బినది. ఇతర వ్యతిరేక వాదనలన్నీ తరువాత మనమీద రుద్దబడినవే. లేదా ఫాషన్ కోసం లేదా సరదా కోసం స్వీకరించినవే. సహజంగా పుట్టుకతో వచ్చిన భావాలే దీర్ఘకాలం మనతో ఉంటాయి. ఇతర భావాలు ఆలోచనలు మధ్యలో వచ్చి మధ్యలోనే పోతాయి. మన తల్లిదండ్రులు, తాత ముత్తాతలు మనకందించిన నమ్మకాలను, భావాలను వదలిపెట్టకుండా కాపాడు కోవాలి. దుశ్చర్యలకు పాల్పడే వారి భావాలకు, బోధలకు ప్రభావితులు కాకండి. ఈశ్వరుడున్నాడని ఎలా దృఢంగా నమ్ముతామో అలాగే పునర్జన్మనూ నమ్మాలి. రెండూ పరస్పర సంపూరక విశ్వాసాలు.

ఈ విశ్వంలోని ప్రతిజీవికీ ఒక ఉద్దేశముంటుందని ఆధునిక శాస్త్రజ్ఞులు కూడా నమ్ముతున్నారు. అలాగే ప్రతి కార్యానికీ ఒక కారణమూ ఉంటుంది. దానినే కార్య కారణ అనుబంధమంటారు. మనం ఎన్నో కష్టాలను బాధలను అనుభవిస్తున్నామంటే దానికీ ఒక కారణముండాలి. ఈ కార్య కారణ అనుబంధం ప్రకారంగానే మన కష్టాలకు దుఃఖాలకు కారణం పూర్వజన్మలో మనం చేసిన పాపకర్మలు, దుష్కృత్యాలు అని మన పూర్వీకులు చెప్పారు. అలాగే మన సుఖసంతోషాలకు, అదృష్టానికి పూర్వజన్మలోని మన పుణ్యకర్మలు లేదా సత్కర్మలు కారణం. ఉపనిషత్తులు ఇలా చెప్పాయి. పణ్యో హవై పుణ్యేన కర్మణా భవతి, పాపః పాపేన పుణ్యకర్మలు పుణ్యాన్ని పాపకర్మలు పాపాన్ని సంపాదించి పెడ్తాయి.

పునర్జన్మ ఉన్నదని చెప్పటానికి ఎన్నో యుక్తులు ఉన్నాయి. ఒక వ్యక్తి భాగ్యశాలిగా జన్మిస్తే మరొకడు పుట్టు దరిద్రుడుగా తినటానికి తిండిలేని పరిస్థితిలో జన్మిస్తాడు. ఈ విధమైన తేడాకు కారణం వారికి గత జన్మలోని కర్మఫలితం అని అంగీకరించి నప్పుడే సరియైన సమాధానం లభిస్తుంది. గత జన్మలో చేసిన పుణ్యాపాప కర్మలే ఈ జన్మ ఈ పరిస్థితికి కారణమని చెప్పాలి. పునర్జన్మను వివరించే ఒక శ్లోకమున్నది.

**కశ్చిత్ దుఃఖీ స్వజన్మప్రభృతి సుఖయుతః శ్చాపరః కస్య హేతోః**
**కస్మాదాద్యాప్రవృత్తి స్తనురపి చ కుతౌ కిం న వేత్తి ప్రమీతంః ।**
**స్వాభావ్యం హేతసామ్యే సమమితి విదితం దీప బీజాం కురాదౌ**
**వైషమ్యం కర్మజన్యం యది గదసి జనేః పూర్వమప్యాత్మసిద్ధిః**

అప్పుడే పుట్టిన శిశువు ఏడవటం ఎలా నేర్చుకుంటున్నది? ఏడిస్తే పాలుపడతారని ఆ శిశువుకు ఎలా తెలుసు? పాలు పట్టకపోతే ఆకలితో ఏడుస్తుంది. ఎలా? ఈ ప్రశ్నలకు సమాధానం పునర్జన్మ ఉన్నదని అంగీకరిస్తే లభిస్తుంది. శిశువు గత జన్మ అనుభవాన్ని జ్ఞాపకం తెచ్చుకొని ప్రవర్తిస్తోంది. గతజన్మల అనుభవాలు తగు సమయంలో గుర్తుకు వచ్చి మన ప్రవర్తనకు సహకరిస్తాయి.

అందువలన పునర్జన్మ ఉన్నదనటంలో ఎటువంటి సందేహం లేదు. ●

# చెన్నైలోని తెలుగు పాఠ్యబోధనా సౌరభాన్ని వేళ్లతో పెకలించుకుపోయిన వారెందరో!

## కాపుకు వచ్చిన తెలుగు పంటను కోసుకుని పోయారు

ఈనేల మనదిరా! ఈ సీమ మనదిరా! ఈ తేమ మనదిరా! ఇక్కడ మొలచిన మొక్క మనదిరా అను మాట తెలుగు వట వృక్షంలా చెన్నపట్టణమంతా పరచుకున్నది.

గుడులు వేసిందివాడు! పాకలు వేసిందివాడు! ఇళ్లు కట్టిందివాడు! బళ్లు కట్టింది వాడు! సత్రాలు నిర్మించింది వాడు! చావిళ్లు నిర్మించిందివాడు!

చెన్నయ్ సెంట్రల్ స్టేషన్ వామభుజంగా చెన్నపురి ఆంధ్ర మహాసభా! ఆ సభనందు విరాజిల్లిన తెలుగు సాహిత్యం, కళలు, కవితా సమ్మేళనములు! గళం విప్పిన ఘనఘనాతి నటులు, రిప్పన్ బిల్డింగులో తొలి తెలుగు మేయర్ త్యాగరాజ శ్రేష్ఠుని స్మారక చిహ్నం, కేసరి విద్యాలయములు, కలవళ కణ్ణన్ చెట్టి విద్యాలయములు మద్రాసు ప్రెసిడెన్సీలో పాఠ్యాలు బోధించిన హేమాహేమీలు, వ్యాకరణం బాటవేసిన పరవస్తు చిన్నసూరి! తెలుగు సంస్కృత భాషల్లో అనేకానేక కావ్య గ్రంథాలను ప్రచురించిన వావిళ్ల రామశాస్త్రులు సన్సు! వారే తొలి తెలుగు –అచ్చు జీ.పి. పాయింట్ కారకులు.

ఎంబెరుమానార్ చెట్టి, హో అండుకో, మద్రాసు పెన్సిల్ ఫ్యాక్టరీ! గామా పెన్నులు! బ్రహ్మం పెన్నులు! భారత చలనచిత్ర రంగంలో బహు ఉన్నతంగా 14 ఫ్లోరులుగల విజయా వాహినీ స్టూడియోలు, దేశవిఖ్యాతి గొన్న బి.ఎన్‌కే ప్రెస్, ప్రసాద్ ప్రాసెస్, దేశదేశాల్లో విజయ బావుటా ఎగురవేసిన చందమామ పిల్లల పత్రిక, మైసూర్ బృందావనం గార్డెన్స్ వెళ్ళ నవసరం లేకుండా సకలవన సంశోభితంగా, పారిజాతవనంగా తీర్చిదిద్దబడిన విజయాగార్డెన్స్, కార్పొరేట్ రంగంలో తొలిగా తీర్చిదిద్దబడిన అపోలో ఆసుపత్రి, కేసరీ విద్యా సంస్థలు, దివాన్ బహద్దూర్ కలవల కణ్ణన్ చెట్టి విద్యా సంస్థలు, కన్యకాపరమేశ్వరీ చారిటీస్ సంస్థలు, ఆర్యవైశ్యుల వైభవ వితరణలు, ధర్మ సంస్థలు అన్నీ ఉండీ, తెలుగువారు ఏంచీ లేనివయ్యారు.

దేశంలో అతి గొప్ప స్టూడియో చిత్ర నిర్మాణ కేంద్రమైన ఆంధ్రా హోలీవుడ్!

అన్నిటికీ నెలవైన చెన్నయ్ తెలుగు విద్యా రంగం, అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన తెలుగు విద్యాలయాలు కూకటివేళ్ళతో పెకలించుకుపోయిన తెలుగువారి శ్రమైక సినిమా పరిశ్రమను ఊసెత్తకుండా ఉండగలమా? ఎలా ఉండగలం.

ఏ తెలుగు సినిమా పరిశ్రమ కారణంగా చెన్నయ్ ద్వారాలకు తెలుగు తోరణాలు కట్టుకున్నదో, ఎవరెవ్వర్ని గొప్ప నటులు నటీమణులు కోట్లు సంపాదించి కోటలు కట్టినవారిగా చేసిందో వారే చెన్నయ్‌లోని తెలుగును చెరిపేసారు.

దిగంతాలను చాటిన తెలుగు సినిమా వెలుగు చెన్నయ్‌లో వెలుగు లొలికింప చేసింది.

తెలుగు సినిమా, మూడు పూలు ఆరు కాయలుగా ప్రవర్థిల్ల చేసినదీ నేల చెన్నయ్ నేల!

తెలుగువాడి స్వేదబిందువులతో ఈ నేల నెలకొన్నది. ఈ నేలను పాలించిన వాడు తెలుగువాడు! న్యాయం వాదించినవాడు తెలుగువాడు! న్యాయమూర్తిగా న్యాయం నిర్ణయించి చెప్పినవాడు తెలుగువాడు!

రాజకీయాల్లో రాణించినవాడు తెలుగువాడు! రాజకీయ పార్టీలు ప్రారంభించిన వాడు తెలుగువాడు! కళలను పోషించినవాడు తెలుగువాడు! కట్టడాలను కట్టించినవాడు తెలుగువాడు!

పరిశ్రమలు స్థాపించినవాడు తెలుగువాడు! పారిశ్రామికాభివృద్ధినొందించినవాడు తెలుగువాడు! బట్టలవ్యాపారి తెలుగువాడు! బంగారు వ్యాపారి తెలుగువాడు! విద్యాలయాలు స్థాపించినవాడు తెలుగువాడు!

ఆర్యవైశ్యులందరూ తెలుగువారే! ఆర్ష, ధర్మపరులందరూ తెలుగువారే!

బ్రాహ్మణులు, వైశ్యులు, రెడ్లు, కమ్మవారు, కాపువారు. వెలమవారెందరో ఇక్కడ వివిధ వృత్తులు, వ్యాపారాలు చేసి చెన్నయ్‌ను విస్తృతపరచారు. కొందరు కొన్ని వృత్తులవారితో సంబంధాలు కలుపుకుని వారి వారితో కలిసిపోయినా, వారి సంస్కృతి మూలాల్ని మరచిపోనిదీ నేల!

కలకత్తా, కొల్హాపూర్, ముంబాయి వంటి నగరాలలో ఉన్న తెలుగు సినిమాల నిర్మాణాన్ని చెన్నయ్‌కు గొనివచ్చి, తెలుగు సినిమాలను నిర్మించి, స్టూడియోలు కట్టి, థియేటర్లు కట్టి దేశంలోనే ముఖ్య సినిమా కేంద్రంగా రూపులు దిద్దినది చెన్నయ్ కోడంబాకం, వడపళని ప్రాంతాలను ఆంధ్రా హోలీవుడ్‌గా తీర్చిదిద్దిన వారు తెలుగువారు. వాడవాడలా వారే పెరిగిపోయారు.

భాషా రాష్ట్రాలుగా విడిపోయి ఆంధ్ర రాష్ట్రం యేర్పడి కర్నూలు రాజధానిగా వెళ్ళినా, ఒక్క సినిమా నిర్మాణ సంస్థగానీ స్టూడియోగానీ వెళ్ళలేదు. బెంగుళూరు తిరువనంతపురంలో స్టూడియోలున్నప్పటికినీ ఆంధ్రా హోలీవుడ్‌లోనే సినిమాలు తీసారు.

ఆంధ్రప్రదేశ్ యేర్పడి సారథీ, భాగ్యనగర్ స్టూడియోలున్నప్పటికినీ, మర్రిచెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా సినిమా పరిశ్రమను తరలించుకుపోవాలని భావించినా పోలేదు.

ఎన్టీ రామారావుగారు ముఖ్యమంత్రి అయిన తరువాత ఆయన ప్రక్కనున్న వారి ఆలోచనలతో, హైదరాబాదు వచ్చే సినిమా వారికి ఉచిత స్థలాలిస్తాం. ఇళ్లు కట్టి పెడతాం. వినోదపన్ను సడలిస్తాం, అక్కడ విధిగా చలనచిత్రాల్ను నిర్మించేవారికీ తాయిలాలు కల్పించడంతో నటీనటులూ, దర్శకులూ అక్కడకు తరలిపోయారు.

ఆంధ్రా హోలీవుడ్‌లో చలనచిత్ర నిర్మాణమునకు సంబంధించినవారూ, వారి కారణంగా బ్రతుకుతున్న వారూ, – ఇక్కడ నిర్మించుకున్న యిళ్లను, కాలనీలు, నాగార్జున నగర్, ఎంజిఆర్ నగర్‌లలో నిర్మించుకున్న ఇళ్లను అమ్మివేసుకొని వెళ్ళిపోయారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమకు సంబంధించినవారెందరో ఉన్నారు. చదువుకుంటున్న వారి పిల్లలెందరో వున్నారు. వీరందరూ చాపలు చుట్టుకుని వెళ్ళిపోయేసరికి పాఠశాలల్లోని వారి తెలుగు పిల్లల సంఖ్య తరిగిపోయింది. పాఠశాల తరగతుల్లోని తెలుగు పిల్లలు తరగతికి ఒక్కరూ లేకుండా పోయారు. తెలుగు పాఠ్య సిలబస్ ప్రకారం ముద్రింపబడే పాఠ్య గ్రంథాల శకం ముగిసిపోయింది. తెలుగు బోధించే పాఠశాలలో తెలుగు చదివే పిల్లల సంఖ్య ఏక సంఖ్యలోకి రావడంతో విద్యాశాఖ ఏంచీ చేయగలదు? ప్రభుత్వం ఏవి చేయగలదు? ఉన్న తెలుగువారేం చేయగలరు?


గరిష్ట పరిమితుల్లో నిర్మింపబడే తెలుగు చిత్రాలు లేకపోవడంతో చాలా స్టూడియోలు మూతపడ్డాయ్. విజయా వాహినీ స్టూడియోస్, విజయా లేబొరేటరీ విజయాగార్డెన్స్ విజయా రికార్డింగు థియేటర్స్ అన్నీ మూతబడ్డాయ్.

విజయ నగర సామ్రాజ్యంలా విజయ వాహినీ కూటమి పోవడంతో చిన్న చిన్న వేషాలు వేసేవారు రోడ్‌మీద పడ్డారు. ఆసుపత్రికి హెల్తు సెంటర్‌కు ఆ భవనాలు, వనాలు, షూటింగ్ ఫ్లోరులన్నీ, హోటళ్లుగానూ, షాపింగు కాంప్లెక్సుగా మారిపోయాయి. తెలుగువారు తెలుగు పిల్లల చదువుల కోసం నెలకొల్పిన పాఠశాలలు తమిళ పాఠశాలలుగా మారిపోయాయి. తెలుగు వాచకాలు, ఉపవాచకాలు ముద్రించే అరుణా పబ్లిషింగ్ హౌస్ వంటివి మూతబడ్డాయ్. తెలుగు ప్రెస్సులు మూతబడ్డాయ్. తెలుగు చిత్రసీమవారు కొందరు ఎడమ చేత్తో చావుదెబ్బ కొట్టిపోయారు. ఫిలిం ఛాంబర్లలో తెలుగు సినిమా పరిశ్రమలోని సభ్యులు తెలుగు సభ్యులు తగ్గిపోయారు! తెలుగు కాలనీలు, ఇల్లుకట్టుకున్న తెలుగువారిళ్లు తమిళ సొత్తయి పోయింది. ఇలా తెలుగు విద్యా వెలుగు కృష్ణ పక్షంలోకి ప్రవేశించింది. ప్రభుత్వం తెలుగు విద్యకు మంగళం పలికింది. ●



# ప్రపంచ తెలుగు మహాసభ విలువను భూమన కరుణాకర రెడ్డి పెంచారు!

## -ఆయన రాజకీయాల్లోకి వెళ్ళారు! తెలుగు మహాసభల సోయగం బోసిపోయింది-



ఉపన్యసిస్తున్న కరుణాకరరెడ్డి

తిరుపతి గోవిందరాజుల క్షేత్రం. ఆయన వేంకటేశ్వరస్వామివారి అన్నగారు. ఆ క్షేత్రంలోనే ఓ తెలుగుకు ఓ అన్న పుట్టాడు. ఆయన 'టుడా' (తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్) చైర్మన్‌గా ఉన్నప్పుడు తిరుపతిలో ప్రపంచ తెలుగు మహా సభల స్థాయిలో తెలుగు మహాసభలను వైభవంగా జరిపాడు. తిరుమలలోని వేంకటేశ్వరుడు అనుగ్రహించి ఆయన్ను తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి చైర్మన్‌గా చేయడంతో తెలుగు మహాసభలు ప్రపంచ తెలుగు మహాసభలుగా దీప్తి నొందాయి. తిరుపతిని, తెలుగు సాహితిని క్షేత్రస్థాయికి గొని పోయాడు. ఎక్కడ చూచినా తెలుగు వెలుగే! ఏ వీధి తిలకించినా, తెలుగు మహన్మూర్తుల చిత్రాలే! వందల యేళ్ల క్రితం వారి నుంచీ, వర్ధమాన తరం వరకు, బేనర్‌లలో ప్రవర్ధమానుల్ని చేసారు. ఆయనకు పార్థసారథుల్లా శైలకుమార్, శాకం నాగరాజు పవలు రాత్రుల్లు అనకుండా వెన్నంటి ఉండి కృషి చేసారు. దేశవ్యాప్తంగా ఉన్న తెలుగు రచయితల్ని మహాసభలకు రావించడంలోనూ, వారిని సత్కరించడంలోనూ భూమన కరుణాకరడెడ్డి ద్విభుజాల్లా కృషి చేసారు, నభూతో నభవిష్యతి అనే సామ్యంగా తిరుపతిని, తిరుపతి వచ్చేవారిని అలరించేటట్టు వారు నిర్వహించిన తీరును మరెవ్వరూ మీరలేక పోయారు. క్రమశిక్షణ, కళా సాహితీ పరిరక్షణ, పోషణము తిరుపతిలోని నేల




**తిరుపతిలో జరిగిన ఓ సాహితీ సంస్కృతి మహోత్సవాల సభలో ప్రసంగిస్తున్న కవి మల్లెమాల, రామచంద్రారెడ్డి, గోటేటి శ్రీరామారావు, స.వెం.రమేష్, ప్రొఫెసర్ అరుణాచలం**

అణువణువునా అలరింపచేసింది.

తిరుపతి వీథులెపుడూ బోసిపోయి ఉండేవి. చతుర్వీధి రస్తాల్లోనూ బళ్ళూ, రిక్షా బళ్ళూ, మోటారు బళ్ళ రూపంగా వచ్చే ధూళి దూసరి తప్ప మరేదీ ఆ కూడలిలో కనిపించేది కాదు.

భూమన కరుణాకరరెడ్డి కరుణతో ఆ కూడళ్లన్నీ, తెలుగు మహన్మూర్తుల శిలా, లోహ విగ్రహాలతో నిండుతనం నిరతము వొలికేట్టు చేసారు. శ్రీకృష్ణదేవరాయలూ, అన్నమయ్య వంటి విగ్రహ ప్రతిష్టలు సాధారణంగా జరిగేవే! అయినా ఆ పనినెవరూ పూనుకొనలేదు. భూమన కరుణాకరరెడ్డి విశాల దృష్టితో అన్నమయ్యను, ఆయన కీర్తలను జనగళంలోకి తెచ్చిన వేటూరి ప్రభాకరశాస్త్రినీ, 'మా తెలుగు తల్లికి మెల్లపూ దండ' గీతకర్త శంకరంబాడి విగ్రహాలను ప్రతిష్టించి వారినిప్పటి వారు కనులరా చూచేట్లు చేసిన కీర్తి, కరుణాకర ఒక్కరికే దక్కింది.

రాజకీయ నాయకుడు వచ్చినపుడో, అమాత్యులు వచ్చిన సందర్భంలోనో బేనర్లు తోరణాలు వేలాడ తీయడం ఆచారం. అవి కూడా ప్రధాన రహదారి కూడలిల్లోనే – వారికి కనిపించేట్టు చేసేవారు. వారు చూడడం, చూడకపోవడం వేరే విషయం. వారు పట్టణంలోకీ రావొచ్చు తీరికగా అలిపిరి వెళ్లే మార్గంలో తిరుమలకు వెళ్లిపోనూవచ్చు. కానీ వారి జెండాలు పట్టుకుని తిరిగేవారి కదో సంతృప్తి.

తెలుగు మహాసభ ముఖ్యోద్దేశం పరిడవిల్లేట్లు తెలుగు భాషకు కృషి చేసిన సాహితీవేత్తల చిత్తరువులతో దీపస్తంభాలను దీపింపచేసేట్లు– పాత తరం వారికి దీనబంధుగా, వారందర్నీ పునశ్చరణం చేయించిన తెలుగుదనం ఏ సభల సందర్భంలోనూ చూడలేదు.

ఉదయం 9 గం॥ల నుంచీ రాత్రి 10 గం॥ల వరకూ సభలూ సమావేశాలే. మధ్యలో ఓ అరగంట భోజన విరామం. ఆ ప్రాంగణంలోనే భోజన ఏర్పాటు. ప్రాథమిక పాఠశాలల పిల్లల నుంచీ, కళాశాల విద్యనభ్యసించే విద్యార్థులు వందల సంఖ్యలో పాల్గొనడం అక్కడే చూసాను.

ఎందరో మహానుభావులు వారందరికీ వందనం – అని త్యాగరాజస్వామి వారన్నట్లు అక్కినేని నాగేశ్వరరావుగారు. ఆనాటి కాంతారావు, కృష్ణకుమారి వంటి తారామణులు, ఎంఎస్‌రెడ్డి, సి.నారాయణరెడ్డి సాహితీ ప్రముఖుల్నుంచీ, గోటేటి శ్రీరామారావు, సం.వెం. రమేష్, పి.వి. అరుణాచలం వరకూ, యండమూరి వీరేంద్రనాథ్, కారా, బాపూ, రమణా, గొల్లపూడి మారుతీరావూ జొన్నవిత్తుల వరకూ – వారూ వీరననేలా లిటరరీ వార్ (సాహితీ సైన్యంలోని ఎందరో) రిటైరైన వారు కూడా పాల్గొన్నారు, విదేశాల్నుంచీ వచ్చారు. ఇలా పేరు పేరునా చెప్పడానికి కొన్ని పేరులనే మరచిపోయే అవకాశం ఉన్నందున ఇతర మహానుభావుల్ని చెప్పలేక పోతున్నాను.

ఇంతకూ నేను పొందిన ఆక్రోశమేమంటే – కరుణాకరా! మీరు రాజకీయాల్లోకి వెళ్ళిపోయారు. తెలుగు మహాసభలను మీయంత త్రికరణశుద్ధిగా, అంకిత భావుకతతో చేయకలిగినవారు లేరేయని వెతలందుతున్నాను, భావితరంవారు కరుణాకరరెడ్డిని తెలుగు మహారాజని చెప్పుకోవాలి. ఆనాటి తెలుగు మహాసభ వైభవం పునర్భవిస్తుందనే చిగురాశతో వ్రాస్తున్నాను. నిజం వ్రాయకపోతే నిజానికుండే విలువ పోతుందని వ్రాస్తున్నాను. ●

# అక్టోబర్ 29న పోయారు; నవంబర్ 11న జన్మించారు తేదీలు నిజమే! నెలలూ నిజమే! సంవత్సరాలే వేరు!!

- డా॥ గోవిందరాజుల వేంకట సుబ్బారావు

పాత్ర స్వభావములు చాల విరుద్ధమ్ -



బడిలో చదువుతున్న రోజుల్లో గయోపాఖ్యానం నాటకంలో సాత్యకిగా భీమునిగా రెండు విభిన్న తరహా పాత్రల్లో నటించారు. పెద్ద పొడుగు కాదు, అంత పొట్టీ కాదు. గయోపాఖ్యానం నాటకంలో భీముని పాత్ర ధరించడానికి కొంచెం లావు పడాల్సి వచ్చింది. కసరత్తుల చేసీ, కుస్తీలు పట్టి శరీరాన్ని పెంచుకున్నారు.

గోవిందరాజుల వేంకట సుబ్బారావుగారు శోత్రియ బ్రాహ్మణుడు. కానీ నాటకాల్లో అంతటి శోత్రియ పాత్రలు ధరించనూ లేదు. భీకరంగా, చాందసంగా నటించనూ లేదు.కాని మొదటి చిత్రం 'మాలపిల్ల' చిత్రంలో చాంధస స్వభావుడైన 'సుందర రామశాస్త్రి' పాత్రను గంభీరంగా నటించి, సాంఘిక సామాజిక వర్గానికి ప్రతిబంధకునిగా, ప్రతి నాయకుని పాత్రను ధరించాడే- ఏఁవి ధైర్యం. ఏఁవి ధైర్యం? అనుకున్నారు.

బ్రాహ్మణుడయ్యుండీ, బ్రాహ్మణ వర్గంనుంచీ ఎగతాళి పొందిన పాత్ర. మొదట్లోనే ఆవకాయ అన్నం తిన్నట్లు- అంతటి కారపుతిట్లు తినే పాత్ర. 1938-39 సంవత్సరంలో విడుదలైన ఆ చిత్రాన్ని చూడవద్దని బ్రాహ్మణులు, బ్రాహ్మణ వర్గాన్ని నిర్దేశించారు. ఆ చిత్రంలోని నటులూ, చిత్ర సాంకేతికుల్లో కొందరు బ్రాహ్మణులే! అయినా వారందరూ సంస్కార కళాదృష్టితో చిత్రంలో పాల్గొన్నారు. తెలుగు చిత్ర జగత్తులో 'మాలపిల్ల' చిత్రం వివాదాత్మక చిత్రం. సుబ్బారావు గారిది విలక్షణమైన విలనిత్వం. నూటికీ రెండు వందల మార్కులు గెల్చుకుని, చాన్నాళ్లు తన పాత్ర జ్ఞాపకం ఉండేట్టు చేసుకున్న పాత్ర ఇదేనేమో!

ఇలానే జెమినీ వారి 'బాలనాగమ్మ' చిత్రంలో జంగమదేవరగా వచ్చే మాంత్రికుని పాత్ర. "ఏఁవే బాలా" అని బాలనాగమ్మను అరిచేటప్పుడు చూచి మేమంతా భయపడిపోయాం. జెమినీ వాసన్‌గారి కళ్లకు గోవిందరాజుల సుబ్బారావు గారెలా ఆనారో! అటు ఆరడుగులు అందాల రాశియైన కాంచనమాల- తెనాలి వాసే- సుబ్బారావుగారూ తెనాలివాడే! నాయకి- ప్రతినాయకులు తెనాలివాళ్లు. ఒకరు పొట్టి! మరొకరు పొడగరి! అయినా ఆయన, ఆమెను హడల్కొటించేసాడు. గాండ్ల సంగు పాత్రధారిణి 'పుష్పవల్లి'తో గారాబుగాను నటించాడు.

వీటితో చెప్పుకోదగినది విజయావారి 'షావుకారు' రంగయ్య పాత్ర. 'కన్యాశుల్కం'


బాలనాగమ్మలో

చిత్రంలోని లుబ్ధావధానులు పాత్ర - అక్కినేనిగారు నటించిన జానపద చిత్రాల్లోని రాజుల పాత్ర - ఏ పాత్ర నైసర్గికానికి ఆ పాత్రకు పొత్తు గూర్చిన నటుడు, హత్తుకుని పోయిన నటుడు గోవిందరాజుల సుబ్బారావుయనే చెప్పాలి. 'పల్నాటి యుద్ధం'లో బ్రహ్మనాయుడు 'మాయాలోకం'లో మహారాజు, భరణీవారి తొలిచిత్రం రత్నమాలలో మహారాజు, 'ధర్మాంగద' చిత్రంలో మహారాజు, 'రాజేశ్వరి' చిత్రంలో మహారాజు, ఇలా ఎన్ని చిత్రాల్లో మహారాజుగానూ, నాయకిల తండ్రిగా నటించారనేది లెఖ్ఖలకు మించిన విషయం. కానీ లెఖ్ఖించదగిన క్యారెక్టర్ ఆర్టిస్టు.

సుబ్బారావుగారి ప్రతీ పాత్రకు మీసమే పెద్ద ఎస్సెట్. కానీ తొలిచిత్రం 'మాలపిల్ల'లోని సుందరరామశాస్త్రి పాత్రకు మీసం తీసేయవలసి ఉన్నది. గూడవల్లి రామబ్రహ్మంగారు మీసం తీసేయమన్నారు. పాత్రనైనా వదులుకుంటాను గానీ, మీసం తీయనని ఖరారుగా చెప్పారు. కానీ గోవిందరాజుల వేంకటసుబ్బారావుగారి నాటకాల పాత్ర పోషణ తీరును విన్న రామబ్రహ్మంగారు ఆ పాత్ర నెలాగైనా సుబ్బారావుగారి చేతనే నటింపచేయాలని నిర్ణయించుకున్నారు. టాకీలు వచ్చిన కొత్త రోజుల్లో నాటకాల్లో నటించే నటీనటులను మాత్రమే సినిమా పాత్రలకు ఎన్నుకునేవారు. రంగస్థల నటులకు కూడా సినిమాల్లో నటించాలనే ఆసక్తి ఉండేది. మాటా పాటా పద్యం పాడే నటుల్నే ఎక్కువగా తీసుకునేవారు.

చిత్రం కథ బహు ప్రాధాన్యం ఉన్న పాత్ర, నాయకుని పాత్రకన్నా ప్రధాన పాత్ర. రామబ్రహ్మంగారికీ సుబ్బారావుగారికి ఉన్న బేదాభిప్రాయం మీసమే! పెద్ద వివాదమైంది. మీసం, తలమీద జుట్టు వద్ద వచ్చిన వివాదాన్ని పరిష్కరించుకోవాలనీ, ఆ నటుని చేతనే ఆ పాత్ర ధరింప చేయాలన్న విషయం సుబ్బారావుగారి తల్లి వద్దకు వెళ్లింది. అది ఆ రోజుల్లో అపరాధం. అయినా తల్లి అనుమతిని పొంది, మీస శిరోజాలు తీయాలి, తీసారు. అటు తరువాతి చిత్రాలకు సుబ్బారావుగారు మినహాయింపు యివ్వలేదు. ఆయన చివరి చిత్రమైన బీఎన్‌రెడ్డి గారి దర్శకత్వ చిత్రం 'భాగ్యరేఖ' వరకూ ఆ నియమాన్ని తప్పలేదు.

ఆయన కొన్ని పాత్రలకు అచ్చుగుద్దినట్టు సరిపోయేవారు. ఆయన సంభాషణలు చెప్పే తీరే వేరుగా ఉండేది. ఆయనకు జ్ఞాపకశక్తి కూడా హెచ్చుగా ఉండేది. సినిమాకు 'కంటిన్యుటీ' ప్రధానం. ఏ సంభాషణమెలా చెప్పారు? ఏ దుస్తులు ధరించారు? తన ముందు డైలాగు ధోరణి యెలా ఉండేది అన్నవి ఆయనకు జ్ఞాపకముండేది.

ఫలానా పాత్రను ఆయనచేతనే నటింప చేయాలని తలంచేవారు. అలా తలంచే ఓ పెద్ద చిత్ర నిర్మాణ సంస్థ విజయావారి చిత్రంలో *(తరువాయి 9వ పేజీలో)*

# పద్య సౌరభాలు

పూర్వం రాజులందరూ, కవులూ, కవి, గాయక, కళాపోషకులు. కృష్ణదేవరాయలు వలె సాహితీ సమరవేత్తలు.

వారు కవిత్వం వ్రాయడమే గాకుండా కవులను పోషించేవారు. భారత భారతి వేల సంవత్సరాలుగా తరగని సిరిగా ఉందంటే సాహితీ పోషణమనే చెప్పాలి. ఈ క్రింద పద్య సౌరభాన్ని చూడండి.

పద్యపాదంలోని ప్రతీ మొదటి అక్షరాన్నీ తీసుకుని గ్రహిస్తే 'రాజ దీని వివాహం చేయవయ్యా' అను వాక్యం వస్తుంది.

తనతో తీసుకుని వచ్చిన తన కుమార్తెకు వివాహం చేయించు ప్రభూ! అన్న అర్థిత్వం కనిపిస్తుంది. సార్వభౌముడు కవియే కావున అర్థం చేసుకుంటాడు. కాని వాడయితే 'పోరా' అంటాడు. విక్రమాదిత్యుని వద్దకు బ్రాహ్మణుడు తన కుమార్తెను తీసుకువచ్చి ఇలా స్తుతించాడు.

**రాజ్యంబు దలక రసికత్వమెడలక**
**జయశీలముడుగక నయము చెడక**
**దీనుల జంపక దేశంబు నొంపక**
**నిజముజ్జగింపక నేర్పుగలిగి**
**విప్రుల జుట్టాల నెన్నుసొచ్చియట్టి**
**వారిని గొల్చినవారి ప్రజల**
**హర్షంబుతోగారి యన్యాయ ముడుపుచు**
**మున్ను జెప్పిన రదీతి జెన్ను మీరి**
**చేతలొందు లేక పాత్రల విడువక**
**యశము కలిమి తమకు వశముగాక**
**వసుధ యేలు రాజవర్గంబులోనన**
**య్యాది విష్ణుమూర్తి వంద్రు నిన్ను**

(సిం.ద్వా7-75)

-పై సీస పద్యంలోని ప్రతిపాదంలోని మొదటి అక్షరాలను కలిపి చదివిన 'రాజ దీని వివాహము చేయవయ్యా' అనే వాక్యం ఉంటుంది.

తెలుగు కవిత్వంలో సంఖ్యా శబ్ద చమత్కారానికి ఈ కింది పద్యాన్ని ఉదాహరణంగా చెప్పుకోవచ్చు

**కరిముఖ దశ్వినుల్ శ్రుతుల కంజ సముద్భవు మోము లంబికే**
**శ్వరు మొగముల్ తదాత్మజుని వక్త్రములాది మునీంద్ర మండలం**
**బురగవతుల్ గ్రహంబుల్ పయోరుహనాథుడు తారకంబులున్**
**బొరిబొరినెల్ల సంపదల్ పోలను గుండనికిచ్చు గావుతన్**

కరిముఖుడైన ఏకదంతుడు, అశ్వినులు ఇద్దరు, వేదాలు మూడు, బ్రహ్మతలలు నాలుగు, శివుని వదనాలు ఐదు, అతని కుమారుని ముఖాలు ఆరు, ఆది మునులు ఏడు, దిక్పాలకులు ఎనమండుగురు, గ్రహాలు తొమ్మిది, దశావతారాల పది, ఎత్తిన విష్ణువు అనంతమైన తారకలు, తన కృతిపతిని కాపాడుతూ ఉండాలని కవి అన్నాడు. దీనిని రచించినది మంచెన కవి. కేయూరబాహు చరిత్ర రాసిన నందూరి గుండయ మంత్రికి అంకితమిచ్చాడు. ●

---

*(8వ పేజీ తరువాయి)* ఆయన కోసం అనుకున్న పాత్ర చేజారి పోయింది. అది ఆయన తప్పు కాదు. 'పాలేరు' చిత్రం చేయించిన తప్పు. 'పాలేరు' కోసం గుండు కొట్టించిన తప్పు. డా॥ గోవిందరాజుల వేంకట సుబ్బారావు వేయవలసిన వేషాన్ని డా॥ శివరామకృష్ణయ్య వేసారు. ఆ చిత్రం 'పెళ్లిచేసి చూడు'. 'పాలేరు'లో గుండు కొట్టిన పాత్ర గుండుకొట్టించింది.

ఇంతవరకూ వ్రాసిన వ్యాసంలో ఆయన డాక్టర్ అని పేరు ముందు వ్రాయలేదు. సినిమా టైటిల్ కార్డులో ఆయన పేరు ముందు డాక్టర్ అని వేసేవారు.

తెనాలిలో ఆయన పేరుపొందిన హోమియో డాక్టర్. అటు హోమియో మందులపై విపరీత పరీక్షలు చేస్తూ, పెద్ద పెద్ద పరిశోధకులకు ఉత్తరాలు వ్రాసే నిపుణుడైన డాక్టర్. ఇనార్గానిక్ రెవల్యూషన్ అనే ఆంగ్ల గ్రంథాన్ని కూడా వ్రాసారు.

చదువుకునే రోజుల్లో గురుసామయ్య అనే తెలుగు మేష్టారు, నాటకాల్లో వేషం వేయించేవారు. అలా తొలి నాటకంలో వేషం వేయడం తక్క స్కూలు ఫైనల్ (ఎస్ఎస్ఎల్‌సి) పరీక్షలు వ్రాసేవరకూ నాటకాల్లో వేషాలు వేయనేలేదు. మరల స్కూలులోనే మేకప్ వేసుకుని, 'గయోపాఖ్యానం' నాటకంలో రెండు విభిన్న పాత్రలు ధరించారు. అప్పటి నాటకాల్లో సంగీతం ప్రధానంగా ఉండేది. అందుకోసం 20 రాగాలను నేర్చుకున్నారు.


'షావుకారు'లో

ఏ రాగాన్నైనా అవలీలగా పాడేవారు. ఏ సంభాషణనైనా ప్రత్యేక శైలిలో చెప్పేవారు. నేలమీద కూర్చున్నవారి నుంచీ కుర్చీలపై కూర్చున్నవారు సహితమూ 'వన్స్‌మోర్' అనేవారు. పాటలు, పద్యాలకు వన్స్‌మోర్ చెప్పడం సహజం. కానీ సంభాషణలకు 'సెహబ్బాష్ వన్స్‌మోర్' అని చెప్పడం ఆ రోజుల్లో లేవు. ఆయన్ను బాగా వెన్నుతట్టి, బాగా ప్రోత్సహించిన సమాజం తెనాలి రామవిలాస్ సభ. రంగస్థలంపై ద్విపాత్రాపోషణం చేసినవారు డా॥ గోవిందరాజుల వేంకటసుబ్బారావే.

'బొబ్బిలి' నాటకంలో హైదర్‌జంగ్, బుస్సీ పాత్రలను అద్భుతంగా పోషించేవారు.

"ప్రతాపరుద్రీయం'లోని ఆయన తన నటనా ప్రతాపాన్ని చూపారు. మద్రాసులో ఆ నాటకరచయిత 'వేదం వేంకటరాయశాస్త్రి' గారి సమక్షంలో ప్రదర్శించినపుడు ఆయన ప్రశంసలను ఘనంగా పొందారు.

ఓ ప్రక్క డాక్టరుగా ప్రాక్టీసు చేస్తూనే నాటకాల్లో నటించారు. చెన్నయ్‌లో ఆయన సినిమా నటునిగా స్థిరపడిన తరువాత కూడా ఆయన డాక్టరుగా ప్రాక్టీసు చేస్తూనే వచ్చారు. 1895 సం॥ము నవంబర్ 11న తెనాలిలో జన్మించిన గోవిందరాజుల వెంకట సుబ్బారావు గారు 1959 సం॥ అక్టోబర్ 29న 64 సం॥లాకే కాలం చెందారు. ఆయన నటనా శైలిని పుణికిపుచ్చుకున్న వారు లేనే లేరని చెప్పాలి; ఆయన నట వారసులూ లేరు. ●


రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన

"అజంతా"

వక్కపొడి

రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

044 25204046, 26171341

# బాలశౌరి రెడ్డిగారు లేరనునది జీర్ణించుకోలేకున్నాం

కాలం అనంత ప్రవాహం. అది యెవరి యిష్టాయిష్టాలతోనూ సంబంధం పెట్టుకోదు. కొలమానాలు భాష్యాలూ దానివే. కాలం ముందు నిలబడి వాగ్దానాలు, ప్రమాణాలూ చేయాలని మనిషి చూస్తాడు. ఇరుసు పట్టుకుని కాల చక్రం ఆకులు పట్టుకోవాలని చూస్తాడు. ఆయన మా యింటికి వస్తానన్నారు, రాలేదు. ఆయన ఉచ్ఛ్వాస నిస్వాసలు హిందీ తెలుగుల వెలుగులు. జాతీయ భాషను నేర్చుకోవాలి. నేర్చుకోకపోతే జాతికే నష్టం. అన్నది శౌరి భావమనుకుంటాను.

శౌరి అంటే కృష్ణుడు. బాలశౌరి అంటే బాల కృష్ణుడు. బాలకృష్ణుడెప్పుడూ చిరునగవులు చిందిస్తూండేవాడు. బాల శౌరిరెడ్డి మోములో నేనెపుడూ చిరునగవులే చూసాను. నవ్వకపోయిననూ ఆయన మోము నవ్వుతూన్నట్లుండేది. మద్రాసు యూనివర్శిటీ తెలుగు ఉత్సవాల్లో, మొన్నమొన్న నాకు జరిగిన సంపూర్ణ చంద్రదర్శన సభలో నిండునగవు ముఖాన్నే చూసాను. ఈయన కెపుడు చీకాకులు కలుగవా?

బాలశౌరి రెడ్డి విశ్రాంత పథికుడు. అవిశ్రాంతికుడనీ చెప్పాలి. తెలిసికొనదగినది తెలుసుకొన్నాడు! చేయదగినది చేసాడు! పొందదగినది పొందాడు! స్తుత సోత్రాలన్నీ వదిలాడు. చనిపోయేనాటికి 88 సం॥ముల వయసు అంటే విశ్వసించలేకున్నాను. మోములోగానీ, ఆ పాదకమస్తక శరీరంలోగానీ ముదిమి ఛాయలు ప్రోది చేసుకోలేదు. చేతి కర్రను పట్టనూలేదు. నిరాశనిస్పృహలన్నిటినీ ఆమడదూరానికి తరిమేసినట్లు కనిపించేవాడు. సర్వకాల సర్వావ్యవస్థల్లోనూ జాతీయభాషా సేద్యముగ హిందీని వేద్యంగా చేసుకుని ఎన్నో అవార్డులు, సత్కార పదవులు, సత్కారములందుకున్నప్పటికీ, ఏమీ ఎరుగనివానివలె, ఇంకేవో గ్రహించాల్సి ఉందని భావించే అధ్యాసంతో, అభ్యాసభావనతో ఉండేవాడు. పండితునిగా, పత్రికా రచయితగా, పలు గ్రంథకర్తగా, పలు గ్రంథ అనువాద కర్తగా, ద్విభాషావేత్తగా ఆరున్నర దశాబ్దాలకు పైగా, కవి పండిత కృషీవలునిగా ఔత్తరాహుల అభినందన సత్కార సంస్కార, సాంస్కృతిక అభిమానం పొందిన దాక్షిణాత్యుడూ, తెలుగువాడు. వాడని మల్లె తీగలా పుష్పాలు పూస్తూ, నిడివిగల గుమ్మడి తీగలా విస్తృతిగా ఇంటి పెంకులు దాటినట్లు, పందిరలెక్కి ఫలసమర్పణ చేసే ద్రాక్ష గుత్తుల్లా, బాల శౌరిరెడ్డి హిందీ పాండిత్యం పరిఢవిల్లిదంటే ఎంతో గర్విస్తున్నాను, సంతోషిస్తున్నాను.

ఆయనుండే అశోక్‌నగర్‌లోనే, నేనూ ఉంటున్నాను. ఆయన కుమారుడూ, నా కుమారుడూ ఎడతెగని స్నేహబంధీకులని గ్రహించాను. ఆయన నాగిరెడ్డి గారు నడిపిన 'చందమామ' హిందీ పత్రికకు సంపాదకునిగా ఉండేవారు. ఆయన హిందీ తెలుగు భాషల్లో ప్రావీణ్యత కలుగువారగుట వల్లనే, వారికా సంపాదకార్హత నిచ్చారు. నాగిరెడ్డి చక్రపాణిలిరువురూ సామర్థ్యములెన్నుటలో నిష్ణాతులు. హిందీ పత్రిక యావద్భారత దేశస్థుల్నీ (వివిధ ప్రాంత భాషీయుల) ఆమోదం పొందడం సామాన్య విషయం కాదు. హిందీ వారి నరాల్లో ఉంటుంది. మనకు కండరాల్లో ఉంటుంది. నరాలకు ఇంజెక్టు చేయడమంత సామాన్య విషయం కాదు. 'CAT' కాట్స్ కాట్ మానే బిల్లి అంటే దెబ్బ. నరాల్లోని ఇంజెక్టు చేయడానికి ఆశు కవితా పరిజ్ఞానం కల ఉభయ భాషజ్ఞులు కావాలి. అలాంటి ఉభయ భాషజ్ఞుడు బాలశౌరి రెడ్డి. ఉభయభాషా సాహితీ శౌరి అనాలి.

కడపజిల్లాలోని చిన్న కుగ్రామం గొల్లలగూడూరులో జన్మించి, అలహాబాద్, బెనారస విద్యాలయముల్లో విద్యనభ్యసించి, అక్కడి విద్యాలయాల్లోనే ప్రిన్సిపాల్‌గా పనిచేయడం సామాన్య విషయం కాదు.

హిందీని గాంధీగారు అక్కున చేర్చుకుని, హిందీపై ఆసక్తి కలుగడానికి ఓ పథకం రూపొందించారు. స్వల్పకాల ప్రణాళికలో హిందీ నభ్యసించి ఉత్తీర్ణులయ్యే దక్షిణ భారతీయులకు మహాత్మా గాంధీ సంతకం చేసిన సర్టిఫికేట్లు యిస్తాం. అవకాశాన్ని వినియోగించుకోమంటూ దక్షిణ భారత హిందీ సభవారు (నయా హిందూస్థానీ అని పేరు జ్ఞాపకం) వాచకం, నిర్ణీత సమయంలో పరీక్షా పెట్టారు. ఉత్తీర్ణతతో నిమిత్తం లేకుండా గాంధీగారి సంతకంతో ఉత్తీర్ణతా పత్రాలను (సర్టిఫికేట్సు) యిచ్చారు. అలా ఉత్తీర్ణుడైనవారిలో నేనొకణ్ణి.

అలాంటి ఉత్తీర్ణుడు గాకుండా ఉత్తరాదికే వెళ్ళి బనాసర్ విద్యాలయం (కాశీ విశ్వవిద్యాలయం)లోనే విద్యనభ్యసించడం– వారి కుతూహలానికి పట్టాభిషేకం చేసినట్లయింది. కడప, నెల్లూరు, తిరుపతి, అలహాబాద్, బెనారస్‌ల్లో వారి విద్యాభ్యాసం జరిగింది. భాష తరువాత ఆ భాషా సాహిత్యం ఆ భాషా సంస్కృతి అలవరచు కోవడంలో వారి అనవరతమైన కృషి, అధ్యయనం తెలుస్తూంది. తెలుగు, తమిళం, హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు, కొంతగా కన్నడం నేర్చుకోవడంతో బాలశౌరిని వివిధ భాషల అధ్యయనపరుడని చెప్పాలి. దాశరథిగారు చెప్పినట్లు 'బాల' అనుపదంలో **ప్రౌఢ** అను గూడార్థం ఉన్నది. పరవస్తు చిన్నయసూరిగారు వ్రాసిన తొలి వ్యాకరణ గ్రంథానికి బాల వ్యాకరణం అని పేరుపెట్టారు. బాలశౌరిరెడ్డి ఐతిహాసిక గ్రంథం 'రామాయణంలోని భారతీయ సంస్కృతి' అను గ్రంథం 'ఆంధ్రజ్యోతి' పత్రికలో ధారావాహికంగా ప్రచురితమైంది. వాల్మీకి రామాయణ కాలంలోగల సాంస్కృతిక జీవనాన్ని ప్రతిబింబింపచేసిందని జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సి. నారాయణ రెడ్డి అభినందించారు.



గోటేటి శ్రీరామారావు సహస్రచంద్రపూర్ణ సభలో అభినందిస్తున్న బాలసౌరి

శౌరిరెడ్డిని ఎన్నో విశ్వవిద్యాలయాలు సత్కరించాయ్. ఆ సత్కారంతో వారు తమ విశ్వవిద్యాలయాలకే గౌరవ మనుకున్నారు. వాఙ్మయ రత్నాకర, సాహిత్య వారథి, డాక్టరేట్, విద్యా భాస్కర బిరుదములెన్నో– ఎన్నెన్నో పొందారు.

ఇహ విదేశీయానాలైతే చెప్పనే అఖ్ఖర్లేదు. అమెరికా, ఇంగ్లాండు, నార్వే, సింగపూర్, మారిషియస్, డెన్మార్క్, శ్రీలంక, నేపాల్ ఆదిగా గల దేశాలెన్నో పర్యటించారు. దాదాపు 80 గ్రంథాలు వ్రాసారు. వివిధ హిందీ, తెలుగు ఆంగ్ల పత్రికల్లోని వ్యాసాలకు లెఖ్ఖేలేదు. మద్రాసులోని హిందీ ట్రైనింగు కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేసారు. ఈలాటి పదవులు వివరించీ చెప్పాలంటే ప్రముఖాంధ్ర సంచిక చాలనే చాలదు.

యెద్దుల గంగిరెడ్డి, ఓబులమ్మ సంతానంగా కడపజిల్లా పులివెందుల తాలూకా, గొల్లల గూడూరులో 1928 సం॥ము జూలై 1న జన్మించిన శౌరిరెడ్డి 15 సెప్టెంబర్ 2015 మంగళవారం ఉదయం 8.30 గం॥లకు ఉదయకృత్యములు తీర్చుకుని కాఫీ త్రాగి, ఉదయం వచ్చే ప్రతికల్ని చూచి, ఉదయం నడిచే నడకను పూర్తి చేసుకునివచ్చి స్థిమితంగా కూర్చున్నారు. ఆకస్మికంగా గుండెపోటు వచ్చి ప్రాణాల్ని పట్టుకుని పోయిందంటే మృత్యువుకు జాలి లేదనుకోవాలి. ఇంకొక రెండు సంవత్సరాలుంటే నవాబ్దిని జరుపుకునేవాడు.

సెప్టెంబర్ 15 ఉదయపు పొద్దెందుకో కురచబడిపోయింది. ప్రచండ తేజోశాలియైన సూర్యభగవానుడు వెంటనే కనిపించకుండా నురుగుల్లాంటి నల్ల మబ్బుల కాస్కారమిచ్చాడేఁవిటా అనుకున్నాను. వాళ్లబ్బాయి మా అబ్బాయికి ఫోను చేసి విషాదవార్త చెప్పాడు. నేనూ విషణ్ణుడనయ్యాను.

ఈ విచార దుఃఖ సమయాన వారి కుటుంబ సభ్యులకు, వారి శ్రీమతిగారికి నా సానుతాపమును తెలుపుతున్నాను. ●

# అందరివీ తేనె మనసులు! ఆదుర్తి సుబ్బారావు మనసు అందరికన్నా తేనెమనసు!!



ఆదుర్తి సుబ్బారావు

తెలుగు తెరకు తేనెమనసులు కృష్ణ దొరికి ఇప్పటికి 50 ఏళ్లు దాటాయ్. కృష్ణ అంటేనే 'తేనెమనసు- ఎవరూ ఆయన మనసు అధిగమించలేదు. సాహసం + మంచితనం+ కష్టించే తత్వం + గ్లామర్ = కృష్ణ స్వంతాలు. ఆదుర్తి సుబ్బారావు లేకపోతే కృష్ణ తెరకు వచ్చేవాడు కాదు. కృష్ణ లేకపోతే తెలుగు సినిమా చాలా మిస్సయిపోయేది.

ఇలా నూటికో కోటికో ఒక్కరు ఉంటారు. కాని వారెవరూ ఆదుర్తి సుబ్బారావుకు సాటి రారు.

నూరు సంవత్సరాలు మించిన తెలుగు సినిమా చరిత్రలో 1963 సం॥ము ముందూ 1963 సం॥ము వెనుక ఇప్పటివరకు, ఆదుర్తి సుబ్బారావు వంటి సాహసమూ, చొరవా, మాటకు కట్టుబడే తనంగల దర్శక నిర్మాత రాలేదు.

ఒకరో ఇద్దరో, ముగ్గురో కొత్త నటీనటులను ప్రవేశపెట్టవచ్చు. చిత్రంలోని ప్రధాన పాత్రలలో అందరినీ ప్రవేశపెట్టినవారు అరుదు, లేరేమో కూడా!


ఆదుర్తి తరహాయే వేరు. 'హారతి' పత్రికలో పత్రికారచయితగా జీవితం ప్రారంభించాడు. కాబట్టి కథలపై నమ్మకం ఉన్నవాడు. కొత్త తరహాగా పత్రిక రావడానికి వొరవడి పెట్టినందున కొత్తతనాన్ని వెదుకుతూండడం ఒక అలవాటు. పత్రికా జీవితంలో కష్టాలుపడ్డాడు. కాబట్టి కష్ట జీవితం తెలుసుకోవడం, మాట నిలబెట్టుకోనివారి నెందర్నో చూచి ఉంటాడు కావున యిచ్చిన మాటను నిలబెట్టుకునే స్వభావం అలవరచుకోవడం- ఇదంతా ఆయన చూచాడు.

అలాటి బాధలెవరూ పడకూడదనే నైజమేమో- సంగీత స్వరయుక్తమైన 'అమరసందేశం' చిత్రాన్ని అమరనాథ్ యనే కొత్తపాతాకాని హీరోతో దర్శకత్వం నెరపి, అటు హీరోకీ, ఇటు తన దర్శకత్వానికీ పేరు ప్రతిపాదితం చేసుకున్నారు.

అన్నపూర్ణా పిక్చర్సును ప్రారంభించిన దుక్కిపాటి మధుసూదనరావుగారి చిత్రాలకు అక్కినేని నాగేశ్వరరావు హీరో. తొలిచిత్రం. కె.వి.రెడ్డి గారి దర్శకత్వాన దొంగరాముడు చిత్రాన్ని నిర్మించారు. వరుస చిత్రాలను తీయాలని సంకల్పించిన ఆయన – ఓ దర్శకుణ్ణి శాశ్వతంగా నియమించుకుంటే బాగుంటుందని భావించాడేమో- ఆదుర్తి సుబ్బారావుపై ఆయన దృష్టి పడింది. 'తోడికోడళ్లు' చిత్రం నుంచీ వరుసగా నిర్మించిన చిత్రాలకు ఆయనే దర్శకుడు. ఇలా పాప్యులరైన ఆదుర్తి సుబ్బారావు, సి. సుందరం అను నిర్మాతతో బాబు పిక్చర్స్‌ను ప్రారంభించి 'మూగమనసులు' చిత్రాన్ని నిర్మించి విడుదల చేసారు. అది తెలుగు చలనచిత్రాల్లో జుబిలీ చిత్రమై, కలెక్షన్స్‌లో- ఆడియన్స్ సెలక్షన్స్‌లో నెం1 అయింది.

అప్పుడాయన బాబూ పిక్చర్స్ తరఫున రెండో చిత్రాన్ని నిర్మించాడానికో సమస్య ఎదురైంది. అంతకన్నా గొప్ప చిత్రాన్ని, ఆ తారాగణంతో నిర్మిస్తే 'మూగమనసులు' మించి ప్రజాభిమానం సంపాదిస్తుందా? ప్రశ్నించుకున్నాడు. 'తేనె మనసులు' యని చిత్రం టైటిల్ పెట్టడం జరిగింది. అందరూ కొత్తవాళ్ళతో చిత్రం నిర్మించాలనే దృఢసంకల్పం కలిగింది. ఆదుర్తి కొత్తవారి కోసం వెదకడం ప్రారంభించారు.

అటు బుర్రిపాలెంలో ఎర్రటి బుల్లోడిగా అందరి నోళ్లల్లోనూ నృత్యమాడుతున్న ఘట్టమనేని శివరామకృష్ణ కళ్ళల్లో కనపడ్డాడు. శివరామకృష్ణకు సినిమాలో నటించాలనే కుతూహలం ఎక్కువైంది. ఆ వూరిలో పేరు పొందిన ఘట్టమనేని రాఘవయ్య చౌదరిగారి జ్యేష్ఠపుత్రుడీ శివరామ కృష్ణ.



తేనె మనసులు సెలెక్షన్స్ కోసం కృష్ణ తీయించుకున్న ఫోటో

బుర్రిపాలెం చిన్న ఊరేయైనప్పటికినీ బస్సుయెక్కితే పావుగంటలో తెనాలి చేరవచ్చు. చొక్కా కాలర్‌పైకి వేసుకుని, క్రాఫింగ్ సరిచేసుకుని తిరుగుతూంటే బుర్రిపాలెంలోనూ, తెనాలిలోనూ అందరూ అతణ్ణి సినిమా హీరో అనుకునే వారు.

శివరామకృష్ణ తండ్రి రాఘవయ్య చౌదరిగారికి కూడా సినిమాల్లో హీరో కావచ్చునేమోనని భావించారో యేమో- ఆయన స్నేహితుడు, తెనాలి వాస్తవ్యుడూ విజయా ప్రొడక్షన్స్ నిర్మాతల్లోని ఒకరూ, ప్రముఖులైన చక్రపాణిగారితో చెప్పారు. చిన్నపిల్లాడు కదా- కొంతకాలం వేచి ఉండమను, నేనే వేషం యిస్తానన్నారు.

సినిమా ఆర్టిస్టు కావాలనే ఉర్రూతలూగేవాడు; ఎంత త్వరగా హీరో అయితే అంత బాగుంటుందని అనడం ఊరివాళ్లు ఊరించడం చూచి పత్రికల్లో కొత్తవాళ్లు కావాలని వచ్చే ప్రతీ ప్రకటనకీ ఫోటోలు పంపేవాడు.

ఎల్వీ ప్రసాద్‌గారు కొత్త హీరోలు 'కొడుకులు కోడళ్లు' చిత్రంలో నటించడానికో కొత్త హీరో కావాలంటూ ప్రకటన వేసారు. శివరామకృష్ణ ఎప్పటిలానే ఫోటోలు పంపాడు. సెల క్టయ్యాడు. ఎందువల్లనో ఆ చిత్రం సెట్‌మీదకు వెళ్లలేదు. 'బాడ్‌లక్' అనుకున్నాడు – ఇదిగాకపోతే మరో చిత్రం రాకపోదు అనుకున్నాడు. చెన్నయ్ రావడం మానుకోలేదు. టిప్‌టాప్‌గా తయారయి, పాండీ బజారులో 'కాఫీ' త్రాగుతున్నాడు. అటుగా వెడుతున్న చిత్రాలయా శ్రీధర్ చూచి తాను నిర్మించే 'కాదలిక్క నేరమిల్లే' చిత్రంలో నువ్వో హీరోవోయ్ అన్నాడు ఆఫీసుకు పిలిపించాడు. శివరామకృష్ణ ఆనందానికి అవధుల్లేవు. అయితే శివరామకృష్ణ ఒక్క ముక్క అంటే ఒక్క ముక్క తమిళం రాదు. మాట్లాడనూ లేదు. తెలుసుకోనూలేదు. మళ్లీ వచ్చిన హీరో ఛాన్సు పోయింది. ఇల్లా ఇల్లా 'ఇల్లా' అనిపించుకోకుండా మద్రాసులోనే ఉండటానికి స్థిర నిశ్చయుడయ్యాడు. జగ్గయ్యగారి 'పదండి ముందుకు' చిత్రంలో ఓ చిన్న వేషం వొస్తే వేసాడు. ఎన్టీయార్

*(తరువాయి 12వ పేజీలో)*

# హనుమద్దాస్‌గారి ఆంజనేయ శక్తి - జనా భగవాన్‌గారికి ఫలించిన వైనం!!



విధివిలాసం నవంబరు 2014 సంచిక ముఖచిత్రంగా వెలసిన 'దిన్యూ లైఫ్ ఆఫ్ థియోలాజికల్ యూనివర్సిటీ (USA) నుండి డాక్టరేట్ అందుకున్న జానా భగవాన్‌గారి వెనుక మరుగై యున్న బ్రహ్మశ్రీ హనుమద్దాస్ స్వామీజీవారి లేఖ చదువుకొనగలరు. కొన్ని సంవత్సరాల క్రితం జానా భగవాన్‌గారు నిర్మించుకొన్న లాడ్జీ లీజుకివ్వగా, ఆ లీజ్‌కిచ్చిన వ్యక్తి లీజు డబ్బు చెల్లించకుండా, లాడ్జీని ఖాళీ చెయ్యకుండా, పైగా లాడ్జ తన సొంతమని చెబుతూ ముప్పుతిప్పలు పెడుతున్నాడు.




కోర్టు పాలైన ఆ సమస్యను హనుమద్దాస్ స్వామీజీకి విన్నప పత్రమును పంపగా, స్వామీజీ అపూర్వ హనుమత్ శక్తిని ఆయనకు పంపారు. దాని ధారణతో ఒక వారంలో లాడ్జిని ఖాళీ చేసిన, అద్భుత సంఘటన జరుగగా, జానా భగవాన్లుగారు స్వామీజీ కాకినాడలో ఒక భక్తుని యింట మకాంలో వుండగా తన కుటుంబ సమేతంగా మల్కీపురం నుంచి కాకినాడకు కారులో వెళ్ళి - దర్శించారు. హనుమత్ శక్తులను ఆయన కుమార్తెకు, కుమారునికి, ఆయన బంధువుకు తాయెత్తు రూపంలో ధరింపజేసారు.. కుమారుడు సాయి శంకర్‌కు, కుమార్తె స్వాతికి మెడికల్ కాలేజీలో సీట్లు దొరకడం తదుపరి... ప్రస్తుతం కుమార్తె M.D. ఫైనల్ యియర్, కుమారుడు M.B.B.S. రెండవ సంవత్సరంలో వుండగా, భగవాన్‌గారు స్వామీజీని కాకినాడ కారులో వచ్చి మల్కీపురం తీసుకువెళ్లడం రూ. 10,000లు యిచ్చి సువర్చలాంజనేయ పాద పూజ చేసుకోవడం జరిగింది. స్వామీజీ మల్కీపురంలో వుండగా అనేక మందిని తన వాహనంలో తీసుకెళ్లి పరిచయం చేసారు. తదుపరి యీయనకు డాక్టరేట్ బిరుదు లభించడం - యిత్యాది వుజ్జ్వల భావి కార్యక్రమాలు స్వామీజీ పర్యటన తరువాతే జరగడం గమనార్హం. ఈ విషయం మీ పత్రికలో ప్రచురించినయెడల అనేక ఆర్తులకు కనువిప్పు కలిగి వారి గడ్డు సమస్యల పరిష్కారములకు దోహదపడగలదని స్వామీజీ ఆశ్రమం తెలిపింది. ●

---

*(11వ పేజీ తరువాయి)*

నటించే 'పరువూ ప్రతిష్ట' సినిమాలో ఓచిన్న వేషం వస్తే వేసాడు. అక్కినేని 'కులగోత్రాలు' సినిమాలో ఓచిన్న వేషం వొస్తే వేసాడు. బ్రూస్ అండ్‌ది స్పైడర్‌లా పట్టువీడని విక్రమార్కునిలా తాను ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కానీ బుర్రిపాలెంలోని అమ్మానాన్న శివరామకృష్ణ ఎదురుచూపులను వారు సహించ లేకపోయారు. ఇంటికి రమ్మనే వొత్తిడి పెరగడంతో బుర్రిపాలెం వెళ్లిపోయాడు.

మళ్లీ నాటకాల బాట పట్టాడు. ప్రజానాట్యమండలి నాటకాల్లో బిజీ అయిపోయాడు. ప్రతి ప్రకటనా చూచి ఆసక్తిగా ఫోటోలు పంపిస్తున్న శివరామకృష్ణ ఈసారి మంచి ఫోజులో ఫోటో తీయించుకుని బాబూ మూవీస్‌కు పంపాడు.

ప్రకటన చేసినది సామాన్యుడు కాదు. అన్నపూర్ణా బేనర్‌లో ఎన్నో విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం చేసాడు. బాబూ మూవీస్ స్థాపించి సిల్వర్‌జుబ్లీ చిత్రం మూగమనసులు చిత్రం నిర్మించాడు. హిందీ చిత్రరంగంలోకి కూడా ఆయన పేరు జోరుహోరుగా ఉంది. తనకు పిలుపొస్తుందని ఘట్టమనేని వారి అబ్బాయి ఘట్టిగా నమ్ముతున్నాడు. ఎప్పటికప్పుడు పోస్టు ఎదురుచూస్తూనే ఉన్నాడు. రాత్రి పోతుంది. పగలు వస్తుంది. మరల పగలు పోయి రాత్రి, రాత్రి పోయి పగలు వస్తూనే ఉన్నాయి. ఉత్తరం రాలేదేమీ చెప్మా అనుకుంటున్నాడు.

ఉత్తరం వచ్చింది. వెంటనే రమ్మని వ్రాసి ఉంది. ఆ ఉత్తరం సంగతి విని బుర్రిపాలెం అంతటా పండుగ, స్నేహితులంతా వెళ్ళరా వెళ్ళరా! వెళ్లి వచ్చి మంచి వార్త చెప్పు అంటూ సంతోషంగా శుభవచనములు పలికారు. తెనాలి వచ్చి చెన్నయ్ మెయిల్ ఎక్కాడు. కూర్చున్నాడే కానీ తొందరగా మద్రాసు వెళ్ళాలనే కుతూహలం. అదే కంపార్ట్‌మెంట్‌లో యస్వీ రంగారావు ప్రయాణం చేస్తున్నారు. శివరామకృష్ణను చూసారు. ఎందుకో అతని మోము కలవరపడుతున్నదని గ్రహించారు. పలుకరించారు. విషయమంతా వివరంగా చెప్పాడు. వెరిగుడ్ ఆదుర్తి చాలామంచి డైరెక్టర్. బెస్ట్ ఆఫ్ లక్. అని అభినందించారు. బృందావనం లాడ్జ్‌లో దిగాడు. శుభ్రంగా స్నానంచేసి, ఆళ్వార్‌పేటలోని బాబూ మూవీస్ ఆఫీసుకు వెళ్లాడు. లోపలనుంచి పిలుపు వచ్చింది. నిర్మాత సుందరం, దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు, కో-డైరక్టర్ కె విశ్వనాథ్ కూర్చుని ఉన్నారు. 'ఏమవుతుందో ఏమవు తుందో అంటూ బిక్‌బిక్ మంటూ కూర్చున్నాడు. లోపలికి పిలిచారు. ప్రొడ్యూసర్ సుందరం అగ్రిమెంటు పేపరు చదువుకుని సంతకం పెట్టి యివ్వమన్నాడు. 'తేనెమనసులు' చిత్రానికి రూ. 2000లు పారితోషికం. తరువాతి చిత్రానికి రూ. 3000లు. సమ్మతమేనా అని అడిగాడు. వెతుకుతున్న తీగ కాలికి తగిలినట్లు సమ్మతమేలా గాకుండా ఉంటుంది! సమ్మతం అన్నాడు. వెంటనే రూ. 500లు అడ్వాన్స్ ఇచ్చారు. అమాంతంగా హీరో అయిపోయాడు.

తేనె మనసుగల ఆదుర్తి సుబ్బారావు ఏ ముహూర్తమున హీరో చేసాడో గానీ చక్కని చిత్రం చీకాకుల్లేని కథ చింతల్లేని కథా చిత్రం హుషారుగా సాగిపోతుంది. ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు, వారి సహచర బంధువర్గం. అన్ని పాత్రల్కూ కొత్తవాళ్లే. శివరామకృష్ణ పేరు 'కృష్ణ'గా హ్రస్వమయింది. 300 చిత్రాల హీరో అయ్యాడు. నిర్మాత అయ్యాడు. బిజీ అయ్యాడు. ఎవరికీ సాధ్యం కాని 'అల్లూరి సీతా రామరాజు' చిత్రాన్ని నిర్మించాడు. హిందీలో కూడా చిత్రాలు నిర్మించాడు. స్టూడియో కట్టాడు. ఎంత ఎదిగినా మంచితనానికి వొదిగే ఉన్నాడు. మనస్సుమంచిది మంచివాడు. కుమార్డు మహేష్ కూడా హీరోగా చలాకీగా మంచి నటుడు. ఇంకా ఏం కావాలి!

SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*



# శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు



93

## పదునేడవ అధ్యాయము - శ్రద్ధాత్రయ విభాగయోగము

**1. యే శాస్త్రవిధిముత్సృజ్య యజన్తే శ్రద్ధయాన్వితాః**
**తేషాం నిష్ఠా తు కా కృష్ణ సత్త్వమాహో రజస్తమః**

**వ్యాఖ్య :-** క్రిందటి అధ్యాయముయొక్క చివర శాస్త్రవిధి నుల్లంఘించి స్వేచ్ఛాచారులై ప్రవర్తించువారికి మోక్షసిద్ధి కలుగదని చెప్పబడినది. అయితే కొందఱు శాస్త్ర నిర్దిష్టములగు విధినిషేధములను శ్రమమని తలంచియో, లేక ఔదాసీన్యము వహించియో, వానినిగూర్చి తెలిసికొనుటకై యత్నింపక, శ్రద్ధతోగూడుకొనినవారై, ఆస్తిక బుద్ధి గలిగి దేవతాదులను అర్చించుచుందురుగదా! అట్టివారియొక్క ప్రవృత్తి యెట్టిది? అది సాత్త్వికమా, రాజసమా, తామసమా అని అర్జునుని ప్రశ్న -

**2. త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సా స్వభావజా**
**సాత్త్వికీ రాజసీ చైవ తామసీ చేతి తాం శృణు.**

**వ్యాఖ్య :** - 'సా స్వభావజా' - అని చెప్పుటవలన పూర్వజన్మ సంస్కారమువలన, జన్మాంతర వాసనా ప్రాబల్యమువలన అట్టి శ్రద్ధ వారియందు స్వభావముగనే జనించునని భావము.

**3. సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత**
**శ్రద్ధామయోఽయం పురుషో యో యచ్ఛ్రద్ధస్స ఏవ సః.**

**వ్యాఖ్య :-** మనస్సే (అంతఃకరణమే) మనుజుడు (ప్రతిబింబరూపజీవుడు); మనుజుడు మనస్సే. కావున మనస్సు శుద్ధముగా నున్నచో మనుజుడున్నూ శుద్ధరూపుడే యగుచున్నాడు. ఇచట 'సత్త్వానురూపా' అను పదములోని సత్త్వమనగా అంతఃకరణము. ప్రతివారికిని వానివాని జన్మాంతర సంస్కారములతో గూడిన యంతఃకరణమెట్లుండునో అట్టి శ్రద్ధ, అట్టి సంస్కారము, అట్టిగుణము వానికి కలుగుచున్నది. ఎవడు ఏ శ్రద్ధ ఏ గుణము గలిగియుండునో అతడు తద్రూపుడే అయియుండును. కాబట్టి మొట్టమొదట మనుజుడు తనయంతఃకరణమును శుద్ధమొనర్చుకొని సాత్త్వికశ్రద్ధామయుడై యుండులాగున ప్రయత్నించి, సాధనాభ్యాసముచే క్రమముగా నిర్గుణాత్మరూపుడై చెన్నొందుటకు ప్రయత్నించవలెను. ఎవనియొక్క చిత్తమెట్టి శ్రద్ధ, గుణము గలిగియుండునో తదనుగుణ్యమగు ప్రవృత్తియే అతడు కలిగియుండుటబట్టి (రాజసిక, తామసిక, శ్రద్ధలను పారద్రోలి) సాత్త్వికశ్రద్ధనవలంబించి క్రమముగా దానిని అధిరోహించి విశుద్ధసత్త్వ (ఆత్మ) స్థితిని జేరుకొనవలెను. అదియే అతని యథార్థస్వరూపము, స్థానము.

**4. యజన్తే సాత్త్వికా దేవాన్ యక్షరక్షాంసి రాజసాః**
**ప్రేతాన్ భూతగణాంశ్చాన్యే యజన్తే తామసా జనాః**

**వ్యాఖ్య :-** ఎవరెవరు ఏ యే గుణము గలిగియుందురో, వారి స్వభావము, వారి నడక, వారియాహారము, వారిమాట, వారితీరు, వారు చదువు గ్రంథములు, వారు పూజించు దేవతలు - తదనుగుణ్యముగనేయుండును. ఈ విషయము నిదివఱకు 14వ అధ్యాయమున తెలిపియుండిరి. భావము దృఢపడుటకొఱకై మఱల నిపుడు తెలియజేయుచున్నాడు.

**5. అశాస్త్రవిహితం ఘోరం తప్యన్తే యే తపో జనాః**
**దమ్భాహఙ్కారసంయుక్తాః కామరాగబలాన్వితాః**

**6. కర్శయ న్తశ్శరీరస్థం భూతగ్రామమచేతసః**
**మాం చైవాన్తశ్శరీరస్థం తాన్విద్ధ్యాసుర నిశ్చయాన్.**

**వ్యాఖ్య :-** 'అశాస్త్రవిహితమ్' - శాస్త్రమునందు విధింపబడని కార్యముల నెవరును చేయరాదని గీత శాసించుచున్నది. ఘోరతపస్సులు, భయంకర రాజస, తామస క్రియలు శాస్త్రవిహితములు కావు. కాబట్టి శాస్త్రవిరుద్ధములగు అట్టి క్రియలు నింద్యములేయగును.

'తప్యన్తే యే తపోజనాః' - వాస్తవముగ తపస్సనగా అంతఃకరణమునందుగల దోషములను భస్మమొనర్చుటయే కాని దేహాదులను క్షీణింపజేయుటగాదని యెఱుగవలెను. కావున అట్టి తపస్సునే ఆశ్రయింపవలెనుగాని తనకును, ఇతరులకును ఉపద్రవకరములైనట్టి క్రూర తపస్సులను (రావణ, హిరణ్యకశిపు లొనరించినవానిని) కాదు.

'కామరాగబలాన్వితాః' - ప్రాపంచిక బలము లెన్నియున్నను, దైవబలములేనిచో అవియన్నియు నిరుపయోగములేయగును. క్షుద్రబలములు కలవారు, దైవగంధము లేనివారు వారెవరైననుసరియే రాక్షసులక్రిందనే జమకట్టబడుదురు. కామరాగములు మానవులయొక్క మానవత్వమును, తదంతర్గతమగు దేవత్వమును హరించివైచి, వారి పారమార్థికను పీల్చి పిప్పిచేసి, నిజాత్మస్వరూపమును గప్పివైచి వారలను రాక్షసులనుగా మార్చివేయగలదు. కావున వానిని త్యజించిచేయవలెను. అసుర స్వభావులకు కామమే బలము, రాగమే బలము; దైవీసంపదగలవారికి భక్తియే బలము, జ్ఞానమే బలము. కాబట్టి కామ, రాగ బలమును వదలివేసి భక్తి, జ్ఞానాదిబలమునే స్వీకరించవలెను.

'కర్శయన్తః శరీరస్థం భూతగ్రామమ్' - శుష్కోపవాసాదులచే ఇంద్రియాదులను కృశింపజేయువారు అసురస్వభావులని యిట చెప్పబడినది. దేహారోగ్యముకొఱకు, వ్రతాదుల నిమిత్తము ఉపవాసమును అప్పుడప్పుడు శీలించుట మంచిదే అయినను, అది మితముదప్పి యుండరాదు. అట్లు మితముతప్పినచో అది అమరికతపస్సేయగును. పుట్టను కొట్టినంతమాత్రమున లోని పాము చావదు. కాబట్టి కేవల దీర్ఘశుష్కోపవాసాదులచే లోనగల దుర్వాసనాదుస్సంస్కారాదులెవ్వియు నశింపనేరవు. కొందఱు తమ యొక్క ఆ యుపవాసాదులను గూర్చి ఘనముగా చెప్పుకొందురు. కాని భగవానుడీ శ్లోకములందు వానిని మెచ్చుకొనలేదు. పైగా అట్లు దేహాదులను శుష్కింపజేయువారు అసుర స్వభావులని చెప్పివైచిరి. కాబట్టి సాధకులివ్విషయమున జాగరూకులై భగవానుడు సెలవిచ్చొనట్లు 'యుక్తాహారవిహారులై' మానవ స్థితి నుండి దైవస్థితికి ఎగబ్రాకవలెనే కాని అసురస్థితికి దిగజారకూడదు.

'మాం చైవాన్తః శరీరస్థమ్' - 'అట్టి శుష్కోపవాసాదులద్వారా వారి శరీరముల లోపలనున్న నన్ను (భగవంతుని) గూడ కృశింపజేయుచున్నార'ని శ్రీకృష్ణపరమాత్మ చమత్కారముగ నిచట పలికిరి. వాస్తవముగ విచారించిన నిర్వికారుడు కృశించుటయేమి? అయినను అట్టివారి చర్యను గర్హించుటకు భగవానుడీవిధముగా పలికిరి. లేక, కృశింపజేయుచున్నారనగా వారి ఆజ్ఞను నిరాకరించుచున్నారనియు చెప్పవచ్చును. 'అన్తః శరీరస్థమ్' అను ఈ పదముచే భగవానుడు దూరముగా లేరనియు, ప్రతివాని శరీరములోపల (పంచకోశాంతర్గతముగ) పంచకోశములను వేఱుపరచి నిజశరీరము నందే భగవంతుని కనుగొని జనులు కృతార్థులు కావలయును. మఱియు శుష్కోపవాసాదులచే లోనగల ఆత్మను బాధింపక మధ్యమార్గమును జేబట్టి, మితాహార సాత్త్వికాహారాదుల నవలంబించి, ధ్యానాదులచే దైవానుభూతిని బడసి కృతకృత్యులు కావలెను.

**7. ఆహార స్త్వపి సర్వస్య త్రివిధో భవతి ప్రియః**
**యజ్ఞస్తపస్తథా దానం తేషాం భేదమిమం శృణు.**

**వ్యాఖ్య :-** ఆహారాదులను నాలుగింటిని గుఱించి చెప్పదలంచి భగవానుడు వానిలో ఆహారమును గూర్చియే మొట్టమొదట ప్రస్తావించుట గమనింపదగినది. జీవుని ఆధ్యాత్మిక సాధనక్రమములో ఆహారశుద్ధి ప్రప్రథమమైనది. ఆహారశుద్ధిచే చిత్తశుద్ధి, చిత్తశుద్ధిచే జ్ఞానోదయము సంభవించును. ఆహారము శుద్ధముగలేనిచో మనస్సున్ను మలినముగా నుండుట వలన దానివలన లక్ష్యప్రాప్తి చేకూరకయేయుండును.

*(తరువాయి వచ్చే సంచికలో)*